ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 03.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 223 పేజీలు:8 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

టీ20 సిరీస్‌లో టీమిండియా తొలి విజయం 8

విశ్వ విజేతలుగా భారత అమ్మాయిలు

మహిళల వన్డే ప్రపంచకప్ లో టీమిండియా విజేతగా నిలిచింది. ఆదివారం నవీ ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచులో 52 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఎన్నో యేండ్ల నిరీక్షణకు తెరదించింది. అభిమానులతో కిక్కిరిసిన మైదానంలో 'వందేమాతరం' నినాదాల మధ్య మధ్య తమ చిరకాల కోరికను నెరవేర్చుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ఆట, షెఫాలీ వర్మ దూకుడు, అమన్ జోత్ కౌర్ స్టన్నింగ్ క్యాచ్ కూడా భారత్‌ను విజయం దిశగా నడిపించాయి.

..:: 8లో

'బాహుబలి' ప్రయోగం సక్సెస్

నింగికి చేరిన సీఎంఎస్ 03 ఉపగ్రహం

- నిర్ధారిత కక్ష్యలో ప్రవేశపెట్టిన 'ఇస్రో'
- ఎనిమిది దశలలో ప్రయోగం పూర్తి
- మన ఉపగ్రహాలు అన్నింటా ఇదే పెద్దది
- 4,410 కిలోల బరువున్న ఉపగ్రహం
- తిలకించిన పాఠశాల పిల్లలు, స్థానికులు
- ఇది శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి ఫలితం
- ఆత్మనిర్భర్ భారత్ దిశగా మన అడుగులు
- ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అభినందనలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 2: భారత నౌకాదళానికి చేదోడు వాదోడుగా ఉండేలా రూపొందించిన సీఎంఎస్ 03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. 4,410 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ కక్ష్యలో ఇస్రో ఆదివారం ప్రవేశపెట్టింది. అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్ ద్వారా దీనిని ఇస్రో ప్రయోగించింది. కౌంట్‌డౌన్ ముగిసిన 24 గంటల తర్వాత సరిగ్గా ఆదివారం సాయంత్రం 5 గంటల 26నిమిషాలకు ఎల్వీఎం3 ఎం5 రాకెట్ నిప్పులు కక్కుకుంటూ నింగికి దూసుకెళ్లింది. కీలక దశలు ముగిసిపోగానే ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం సక్సెస్ కావడం సంతోషంగా ఉందని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ తెలిపారు. ప్రయోగ విజయంలో కీలకపాత్ర పోషించిన శాస్త్రవేత్తలు, సిబ్బందిని అభినందించారు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించిందని, శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్

..:: మిగతా 2లో

బంగారం అంతా అడవులలోని డంపులలో ఉందా! లేదంటే బయట ఎక్కడైనా దాచారా? అనే అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఈడీ అధికారులు పలు రాష్ట్రాలలో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఖాతాలో భారీ ఎత్తున నగదు డిపాజిట్ చేసినట్లు గుర్తించారు. అలానే లొంగిపోతున్న మావోయిస్టుల తమ దగ్గర ఉన్న ఆయుధాల గురించే కాక నగదు గురించి కూడా లెక్కలు చెప్పాకే బయటకు వస్తున్నారని తెలుస్తోంది.





400 కేజీల బంగారం ఎక్కడుంది?!

- 400 కోట్ల నగదు ఎవరి దగ్గర ఉంది?
- మావోయిస్టు డంపులలో భారీ నిధులు
- కరోనా సమయంలో పసిడిగా మారిన కరెన్సీ
- ఆరా తీస్తున్న నిఘా విభాగం అధికారులు
- నిధులు సేకరించేందుకు పార్టీకి భారీ నెట్ వర్క్
- ఇప్పటికే పలువురు సానుభూతిపరుల విచారణ
- బినామీల పేరిట బ్యాంకులలో దాచినట్టు గుర్తింపు
- కంపెనీలు, డొల్ల కంపెనీలలోనూ డిపాజిట్లు!
- నాలుగు రాష్ట్రాల అధికారుల సంయుక్త విచారణ
- లొంగిన మావోయిస్టులు నిధుల వివరాలు చెబుతున్నారా!
- పార్టీని అన్ని రకాలుగా అణిచేందుకు సర్కారు వ్యూహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 2 : 'ఆపరేషన్ కగార్' తర్వాత మావోయిస్టులు వరుసగా లొంగిపోతుండటంతో వారి దగ్గరున్న కోట్ల నగదు, ఆస్తులు ఎక్కడున్నాయోనని ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కరోనా సమయంలో ఈ నగదును బంగారం రూపంలోకి మార్చి ఉంటారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు 400 కేజీల బంగారం, రూ.400 కోట్ల నిధులు మావోయిస్టుల వద్ద ఉన్నాయని అంచనా. ఈ నిధుల గుట్టు రట్టు చేసేందుకు ఈడీ, ఎన్ఐఏ అధికారులు ముమ్మరంగా పని చేస్తున్నారు. ఆపరేషన్ కగార్ వల్ల, ముఖ్య మావోయిస్టు నేతల నుంచి సాధారణ దళ సభ్యుల వరకు చాలా మంది లొంగిపోతున్నారు. ప్రస్తుతం దేశంలో మావోయిస్టుల సంఖ్య తగ్గుతున్న తరుణంలో అనేక ప్రశ్నలు, అనుమానాలు తెర మీదకు వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైంది ఇన్నాళ్లు మావోయిస్టులు సేకరించిన కోట్ల రూపాయల నగదు, ఆస్తులు ఎక్కడ, ఎవరి ఆధీనంలో ఉన్నాయనేది. డంపుల మాటేమిటి! అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు మరో ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. అదేమిటంటే, మావోయిస్టులు

..:: మిగతా 2లో

85 శాతం పీజీ మెడికల్ సీట్లు స్థానికులకే

- కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- నేడో, రేపో ఉత్తర్వులు జారీ చేయనున్న సర్కారు
- హర్షం వ్యక్తం చేసిన టీ జూనియర్ డాక్టర్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 2: పీజీ వైద్య విద్య సీట్ల భర్తీలో రాష్ట్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మేనేజ్‌మెంట్ కోటాలోని 85 శాతం సీట్లను స్థానికులతోనే భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త నిబంధనలు అమలుకు తీసుకురావాలని భావిస్తోంది. తద్వారా సుమారు 400 సీట్లు అదనంగా రాష్ట్ర విద్యార్థులకు దక్కే అవకాశం ఉంది. నేడో రేపో ఇందుకు సంబంధించిన జీఓ విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా, సర్కారు నిర్ణయంపై జూనియర్ వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ సీట్ల కేటాయింపుపై కొంత కాలంగా చర్చ సాగుతోంది. మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం

..:: మిగతా 2లో

షాద్‌నగర్‌లో హైటెన్షన్

గురుకుల డిగ్రీ విద్యార్థినుల నిరసన

- ప్రిన్సిపల్ శైలజ వేధిస్తున్నారని ఆరోపణ
- అవినీతి, అక్రమాలు చేస్తున్నారని ఆగ్రహం
- తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- న్యాయం చేయాలంటూ రోడ్డు మీద ధర్నా
- విద్యార్థినులపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్
- ఆమెను జుట్టు పట్టి లాక్కెళ్లిన విద్యార్థినులు
- దీంతో రణరంగంగా మారిన ఆ ప్రాంతం
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న అధికారులు

ప్రతిపక్షం, షాద్ నగర్

నవంబర్ 2 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆదివారం హైటెన్షన్ నెలకొంది. కమ్మదనంలో ఉన్న నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేధిస్తున్నారంటూ విద్యార్థినులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ఐదు కిలోమీటర్లు నడిచి వచ్చి మరీ వారు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ శైలజ తమను వేధిస్తున్నారని, అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్నారని, వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని

..:: మిగతా 2లో

మణుగూరులో తీవ్ర ఉత్కంఠ

- బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌పై దాడి
- ఫర్నీచర్ దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- ఆ కార్యాలయం తమదేనని వీరంగం
- 144 సెక్షన్ అమలు చేసిన పోలీసులు
- ఆఫీసు వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ఎవరినీ వదిలిపెట్టబోమన్న రేగా కాంతారావు

ప్రతిపక్షం, మణుగూరు

నవంబర్ 2: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వివాదంతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు ఆదివారం నాడు 144 సెక్షన్ అమలు చేశారు. ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండవద్దని పోలీసులు హెచ్చరించారు. సాయంత్రం ఐదు గంటలకు పార్టీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ తరుణంలో ఆయన వ్యాఖ్యలపై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పోలీస్ బలగాలను భారీగా మోహరించారు. 2018లో పినపాక నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రేగా కాంతారావు విజయం సాధించి, తరువాత బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లారు. ఆ సమయంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంతారావు బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుగా మార్చారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన రేగా ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాయం వేంకటేశ్వర్లు గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో మళ్లీ కార్యాలయ వివాదం తెరమీదకు వచ్చింది. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆఫీసు వద్దకు వెళ్లిన

..:: మిగతా 2లో

ప్రధాని మోదీ బడా వ్యాపారుల చేతిలో బందీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భయపడటమే కాకుండా బడా వ్యాపారుల చేతిలో ప్రధాని మోదీ రిమోట్ కంట్రోల్‌గా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు.

7

పాకిస్తాన్, కాంగ్రెస్ షాక్‌లో ఉన్నాయి

'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన షాక్ నుంచి అటు దాయాది దేశం పాకిస్తాన్, ఇటు కాంగ్రెస్ పార్టీ రెండూ కోలుకోలేక పోయాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం బిహార్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు.

7

బిహార్‌లో జోరందుకున్న ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోరుకు బిహార్ సమాయత్తమవుతోంది. ఈ నెల ఆరున మిథిలాంచల్, కోసీ, ముంగేర్ ప్రాంతాలలోని 18 జిల్లాలలో ఉన్న 121 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

7

ఎన్నికలలో హింసను ఈసీ సహించబోదు

ప్రశాంత్ కిశోర్ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసులో జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పార్టీలకు వార్నింగ్ ఇచ్చారు.

7

రాష్ట్రీయం

ప్రణాళికలు, పాలసీల కోసం సెన్సెస్ ముఖ్యం

- రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ భారతి హోళికేరి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: ప్రణాళికలు, పాలసీల రూపకల్పనకు క్వాలిటీ సెన్సెస్ డేటా ఎంతో ముఖ్యమని రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ 112 పరిధిలో నిర్వహించనున్న సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 ప్రీ టెస్ట్ కార్యక్రమం కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ నెల 10 నుంచి 30 వరకూ సెన్సెస్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు సెన్సెస్ డేటా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అంతటి ప్రాముఖ్యత గల సెన్సెస్ ను ఖచ్చితత్వంతో గుణాత్మకంగా నిర్వహించాలన్నారు. 2026-27లో దేశంలో ఇంటింటికీ వెళ్లి డేటా సేకరించే ప్రధాన సెన్సస్ కార్యక్రమం ప్రపంచంలో అతిపెద్దదని ఆమె తెలిపారు. విజయవంతం కావాలంటే ఈ ప్రీ టెస్ట్ కార్యక్రమాన్ని అత్యంత జాగ్రత్తగా, క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ సెన్సెస్ కుటుంబాల వాస్తవ స్థితిగతులను ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు, సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్, సర్కిల్ 22 డిప్యూటీ కమిషనర్, సెన్సస్ చార్జ్ ఆఫీసర్ శ్రీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ కుమార్ గెలుపు కోసం పని చేయాలి

- మంత్రులు పొన్నం, ఉత్తమ్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కట్టుదిట్టమైన ప్రణాళికా చర్యలు చేపట్టాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, యూసుఫ్ గూడా డివిజన్ కృష్ణానగర్ కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికల ఇన్చార్జ్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం వారు డివిజన్ కార్యాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి తదితర పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో అనుసరించాల్సిన వ్యూహాన్ని రచించారు. ఉప ఎన్నికల గెలుపుతో కాంగ్రెస్ కు మరింత జోష్ తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో పని చేయాలన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి, నవీన్ కుమార్ యాదవ్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలందరు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రచారం సందర్భంగా డివిజన్ లో ఎక్కడికి వెళ్లినా మంచి స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

జూబ్లీహిల్స్ లో బీజేపీ మహా పాదయాత్ర

- ఉప ఎన్నిక ప్రచారం నిర్వహించిన బీజేపీ నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం కోసం ఆదివారం నాడు బీజేపీ మహా పాదయాత్రను నిర్వహించింది. ఈ పాదయాత్రను బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రహ్మత్‌నగర్ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా ప్రారంభించారు. గడపగడపకు వెళ్లి ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర కొనసాగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాలను, మోసాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, అసమర్థతతో పలు బస్తీలలో చోటుచేసుకున్న సమస్యలను, వెనుకబాటును వివరిస్తూ ప్రజలలో చైతన్యం కలిగించారు. చెత్త రోడ్డు మీద పేరుకుపోయి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలిపారు. డ్రెయినేజీలు నిండిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 420 హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అందరినీ మోసం చేసింది. రెండేళ్ల పాలనలో ఒక్కరికి కూడా మంచి జరగలేదు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్లు కూలగొట్టుడు అనేలా భయపెడుతున్నారని ప్రజలు రాంచందర్ రావుకు విన్నవించారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 2: అయ్యప్ప నామస్మరణంతో కేతిరెడ్డిపల్లి గ్రామం మారుమోగింది. కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీను గురుస్వామి అయ్యప్ప స్వామి పడి పూజ 18 మెట్ల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీశైలం గురుస్వామి హోమం, గణపతి పూజ, కుమారస్వామి పూజ నిర్వహించి అయ్యప్ప స్వామికి పూలు పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప భక్తులు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మొంథా తుఫానుతో నష్టపోయిన చేనేత కుటుంబాలకు అండగా ఉంటాం. నీటమునిగి తడిచిపోయిన నూలు, రంగులు, రసాయనాలకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారం అందజేస్తున్నాం. వర్షా లతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కేజీ పంచదార ఇస్తున్నాం.

- ఏపీ మంత్రి సవిత

400 కేజీల బంగారం ఎక్కడుంది?!

మొదటిపేజీ తరువాయి

సేకరించిన వందల కోట్ల నగదును కరోనా సమయంలో బంగారం రూపంలోకి మార్చారని నిఘా వర్గాల అనుమానం. మావోయిస్టుల వద్ద దాదాపు 400 కేజీల బంగారం ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఇదంతా ఎక్కడ ఉంది? ఎలా భద్రపరిచారు? అనే అంశాలను నిఘా అధికారులు ఆరా తీస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక

గతంలో మావోయిస్టులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి భారీ స్థాయిలో పార్టీ ఫండ్ వసూలు చేశారు. ఆ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపించారు. పార్టీకి నిధులు సేకరించేందుకు పెద్ద స్థాయిలో నెట్ వర్క్ ఉందన్న విషయం ఎన్ఐఏ) దర్యాప్తులో వెలుగు చూసింది. ఇప్పుడు మావోయిస్టులకు నిధులు అందకుండా పూర్తి స్థాయిలో కట్టడి చేసినా సరే, వారి వద్ద ఉన్న నిధులతో మరో ఐదారు సంవత్సరాలు పార్టీని నడపొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ, అప్పటి వరకు మావోయిస్టులు బతికి ఉండే అవకాశం లేక, వరుసగా లొంగిపోతున్నారు. మావోయిస్టులు తమకు అందిన డబ్బును రెండు రకాలుగా మార్చినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ప్రధానంగా పార్టీ సానుభూతిపరులు, వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట బ్యాంక్ అకౌంట్స్ తెరిచి వాటిలో డిపాజిట్ చేయడంతో పాటు కొందరి పేరు మీద కంపెనీలు, మరి కొన్నిసార్లు డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు జమ చేశారని తెలుస్తోంది. మిగిలిన నగదును బంగారం రూపంలోకి మార్చేశారని అధికారులు భావిస్తున్నారు.

బంగారం అంతా డంపులలో ఉందా!

బంగారం అంతా అడవులలోని డంపులలో ఉందా! లేదంటే బయట ఎక్కడైనా దాచారా? అనే అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఈడీ అధికారులు పలు రాష్ట్రాలలో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఖాతాలో భారీ ఎత్తున నగదు డిపాజిట్ చేసినట్లు గుర్తించారు. అలానే లొంగిపోతున్న మావోయిస్టుల తమ దగ్గర ఉన్న ఆయుధాల గురించే కాక నగదు గురించి కూడా లెక్కలు చెప్పాకే బయటకు వస్తున్నారని తెలుస్తోంది.

85 శాతం పీజీ మెడికల్ సీట్లు స్థానికులకే

మొదటిపేజీ తరువాయి

స్థానికులకు కేటాయించాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేయాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఇప్పటి వరకు మేనేజ్‌మెంట్ కోటా సీట్లని ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తున్నారు. కొత్త నిర్ణయంతో రాష్ట్ర విద్యార్థులకు మేనేజ్‌మెంట్ కోటా కింద అదనంగా 318 సీట్లు దక్కనున్నాయి. మరో 15 శాతం అంటే, 56 సీట్లు ఓపెన్ కేటగిరిలో ఉంటాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

2025—-26 విద్యా సంవత్సరం నుంచి

రాష్ట్రంలో 31 పీజీ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 12 ప్రభుత్వ, 19 ప్రైవేట్ కళాశాలలు. ప్రభుత్వ కాలేజీలలో 1472, ప్రైవేట్‌లో 1511 కలిపి 2,983 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల 50 శాతం సీట్లు అలిండియా కోటాలో భర్తీ చేస్తారు. మిగతా 50 సీట్లను, ప్రైవేట్ కాలేజీలలో 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ఇక ప్రైవేట్ కాలేజీల మిగతా 50 శాతం అంటే 741 పీజీ మెడికల్ సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేస్తారు. వాటిలో 374 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకి వస్తాయి. తాజా నిర్ణయంతో ఆ మొత్తం సీట్లలో 85 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులతోనే భర్తీ చేయాల్సి ఉంటుంది. 56 సీట్లని మాత్రమే ఓపెన్ కేటగిరిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. దీనిని 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని సర్కారు భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ జూనియర్ డాక్టర్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

‘బాహుబలి’ ప్రయోగం సక్సెస్

మొదటిపేజీ తరువాయి

దిశగా ఇస్రో అడుగులు వేస్తోందన్నారు. భారత భూభాగం నుంచి పంపించిన ఉపగ్రహాలలో ఇదే అతిపెద్దది కావడం విశేషం. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఎం5 బాహుబలి రాకెట్ ను ప్రయోగించారు. వందల మంది పాఠశాల పిల్లలు, స్థానికులు దీనిని ప్రత్యక్షంగా వీక్షించారు. ఎనిమిది దశలలో ఈ ప్రయోగాన్ని పూర్తి చేశారు. భూఅనువర్తిత బదిలీ కక్ష్య జీటీవోలోకి సీఎంఎస్03 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. తొలి రెండు దశలలో ఇగ్నిషన్ ప్రక్రియ పూర్తి చేశారు. 110 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్నాక సెపరేషన్ ప్రక్రియను నిర్వహించారు. చివరగా 179.800 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహం వ్యోమ నౌక నుంచి విడిపోయింది. ఈ క్రమంలో ఇస్రో శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఒకరినొకరు అభినందించుకున్నారు.

మన దేశ ప్రయోజనాలను రక్షించుకునేందుకు

హిందూ మహాసముద్రంలో మన దేశ ప్రయోజనాలను రక్షించుకునేందుకు భారత్ ఈ ప్రయోగం చేపట్టింది. సాగరంలో మోహరించిన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, నేల మీదున్న నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఇది దోహదపడుతుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా నౌకాదళం కదలికలను పసిగట్టడానికి ఉపయోగపడుతుంది. 4,410 కిలోల బరువున్న ఉపగ్రహం మన భూభాగం నుంచి భూఅనువర్తిత బదిలీ కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాల అన్నింటిలోకి అత్యంత బరువైనదిగా గుర్తింపు పొందింది. ఇది ఒక బహుళ బ్యాండ్ ఉపగ్రహం. సువిశాల సాగర ప్రాంతంలో టెలికమ్యూనికేషన్ సేవలను మెరుగుపరచడం ఈ ప్రయోగం ఉద్దేశం. ప్రధానంగా నౌకాదళ అవసరాల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. దీన్ని జీశాట్ 7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్ 7 స్థానంలో ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. సీఎంఎస్03లో స్వర, డేటా, వీడియో కమ్యూనికేషన్లను రహస్యంగా, భద్రంగా సాగేందుకు సీ, ఎక్స్‌టెండెడ్ సీ, కేయూ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి.

షాద్‌నగర్‌లో హైటెన్షన్

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు. ప్ల కార్డులు ప్రదర్శించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థినుల ధర్నాను అడ్డుకున్నారు. దీంతో విద్యార్థినులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ ఒకరు విద్యార్థినులపై చేయి చేసుకున్నారు. దీంతో, తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తే తమపైనే దాడులు చేస్తారా! అంటూ విద్యార్థినులు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చారు. మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ జుట్టు పట్టుకొని గుంజుతూ దాడి చేశారు. ఫలితంగా ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారింది. కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు తేల్చి చెప్పారు. పరిస్థితులను అదుపు చేసేందుకు పోలీసులు కొందరు విద్యార్థినులను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

ఆహారం తీసుకోకుండానే

విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల, షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీ నారాయణ, సీఐ విజయ్ కుమార్ విద్యార్థులను ఆందోళన శాంతింపజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కళాశాల భవనానికి చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ శైలజ తమను వేధిస్తున్నారని, అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థినులు అధికారులు, పోలీసులకు దృష్టికి తీసుకొచ్చారు. అనైతికంగా ఫీజులు వసూలు చేయడం, వంట సరుకులు దొంగతనంగా బయటకి తరలించడం, భోజనాలకు సంబంధించి తమకు ఇబ్బందులకు గురి చేయడం వంటి అనేక అక్రమాలతో పాటు బెదిరింపులు, వసూళ్లకు పాల్పడుతున్న ప్రిన్సిపల్ శైలజ పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉదయం నుండి విద్యార్థులు ఎలాంటి ఆహారం తీసుకోకుండానే న్యాయం కోసం కళాశాల ముందు ఆందోళనకు దిగారు. కమిటీ నియమించి ఉన్నతాధికారులకు వాస్తవాలు తెలియజేస్తామని విద్యార్థులు శాంతించాలని కోరారు. అయినా, విద్యార్థినులు మంకు పట్టు వీడకుండా నిరసన వ్యక్తం చేయడంతో కళాశాల వద్ద టెన్షన్‌వాతావరణం నెలకొంది.

మణుగూరులో తీవ్ర ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ కార్యకర్తలు ఫర్నీచర్ ధ్వంసం చేసి నిప్పంటించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఎవరిని వదిలే ప్రసక్తే లేదు: రేగా

బీఅర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేసిన దాడిని ఖండిస్తూ రేగా కాంతరావు సోషల్ మీడియా వేదికగా హాట్ కామెంట్స్ చేశారు. ఎవరి భౌతిక దాడులకు భయపడేది లేదని, ఎంత రెచ్చగొడితే అంత ఎక్కువ ప్రశ్నిస్తామన్నారు. ఫ్లెక్సీ కట్టినంత మాత్రాన అయ్యేదేంటని, కాలమే అన్నీ నిర్ణయిస్తుందని చెప్పారు. భౌతిక దాడులు పిరికి పందల చర్య అని మండిపడ్డారు. కార్యకర్తలు సమన్వయం పాటించాలని, భవిష్యత్ తమదేనన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు ఎవరిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి పెట్రోల్ పోసి నిప్పంటిచారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి దిగారు. దీంతో మణుగూరులో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 2: విద్యార్థులు చదువుతో పాటు క్రిడల్లో రాణించాలని ఎన్టిఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. ఆదివారం కళాశాలలో రెండవ రోజు క్రీడలు ఘనంగా కొనసాగాయి. ఆయన కాసేపు క్రీడలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా పాల్గొంటూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. విద్య నేర్చుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మంచిగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు..

రాష్ట్రీయం

ఓట్ల కోసమే హైడ్రాపై 'పవర్ పాయింట్ ప్రెజెంటేషన్'

- పదేండ్లలో వేల ఎకరాలు కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతలు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: జూబ్లీ ఉప ఎన్నికలో ఓట్లు దండుకునేందుకు కేటీఆర్ హైడ్రాపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసి ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్నదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను తీసుకువచ్చారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలుగా పర్మిషన్లు ఇచ్చారని, ప్రభుత్వ భూములను ఆ పార్టీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. తెలంగాణలోనూ, హైదరాబాద్ లో 75 శాతం చెరువులు, నాలాలు కబ్జాకు గురయ్యాయని కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ నివేదిక ఇచ్చిందన్నారు. నగరంలో 600 చెరువులు ఉంటే బీఆర్ఎస్ హయాంలో 44 చెరువులు మాయం అయ్యాయని, వాటిని మింగేశారని ధ్వజమెత్తారు. 127 చెరువులు సగానికి సగం కబ్జాకు గురి అయ్యాయయన్నారు. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకంతోనే అమాయకులు హైడ్రా బారిన పడ్డారన్నారు. శేరిలింగంపల్లి, హాఫీజ్ పేట్ లో 39 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి వసంత కృష్ణప్రసాద్ బిల్డింగులు కడితే 29 ఎకరాలలో హైడ్రా ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిని కాపాడిందని తెలిపారు. హైడ్రా వచ్చిన తర్వాత 500 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందని, 360 చెరువులలో హైడ్రా తొలగించిందన్నారు. 20 నాలాల మీద ఆక్రమణలు, 38 పార్కుల కబ్జాలను హైడ్రా తొలగించిందని వివరించారు.

60వ 'ఐజీఎఫ్ఆర్ వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్'

- ప్రారంభించిన పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2 : గోల్ఫ్ కు చిరునామాగా మారుతున్న నగరం మరో అతి పెద్ద టోర్నీకి వేదికగా మారింది. తొలిసారి భారత్ ఆతిథ్యమిస్తున్న ప్రతిష్టాత్మక 60వ ఐజీఎఫ్ఆర్ వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ను పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్ షిప్ లో 24 దేశాలకు చెందిన 180 మంది రోటరీ గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ గోల్ఫింగ్ ఫెలోషిప్ ఆఫ్ రోటారియన్స్ (ఐజీఎఫ్ఆర్) సహకారంతో ప్రసూతి ,శిశు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో యేటా దీనిని నిర్వహిస్తోంది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్, వూటీ గోల్ఫ్ కౌంటీలలో ఈ ఛాంపియన్ షిప్ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా కేవలం గోల్ఫ్ క్రీడ ప్రమోషన్ కోసమే కాకుండా మన దేశంలోని పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలు, ఆతిథ్యం వంటి వాటిని విదేశీ గోల్ఫర్లకు అందించడమే లక్ష్యంగా ఉండబోతోంది. హైదరాబాద్ లో అద్భుతమైన ఫలఖ్ నామా ప్యాలెస్ , గోల్కొండ ఫోర్ట్ వంటి టూరిజం స్పాట్స్ నూ ఈ ఛాంపియన్ షిప్ లో భాగం చేశారు. టోర్నీలో ఆడుతున్న గోల్ఫర్లకు ఈ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను వివరిస్తూ సందర్శన ఏర్పాటు చేయనున్నారు.

భాగ్యనగరంలో భారీ వర్షం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: మహానగరంలో ఆదివారం రాత్రి భారీ వర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాలలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. భాగ్యనగరంలోని పంజాగుట్ట, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, యూసఫ్‌గూడ, బోరబండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, బేగంపేట, ముషిరాబాద్, లింగంపల్లి, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మూసాపేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట తదితర ప్రాంతాలలో వర్షం దంచి కొట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాలలో వాన కురుస్తోంది. భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వాన పడుతున్న క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మణుగూరు పార్టీ ఆఫీసుపై
దాడి హేయనీయం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: మణుగూరు పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి దహనం చేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గూండాల రాజ్యం, రౌడీయిజం పెరిగిపోయిందని మండిపడ్డారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే కేటీఆర్జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లాడారు. 60 లక్షల బీఆర్ఎస్ కుటుంబమంతా మణుగూరు పార్టీ శ్రేణులకు తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని అన్నారు. త్వరలోనే మణుగూరును సందర్శిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకలకు, వారి అరాచకత్వానికి భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నలుమూలలా, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని దాకా ప్రతిచోటా రౌడీల రాజ్యం నడుస్తోందని, అరాచకత్వం కొనసాగుతోందని, దీనికి చరమగీతం పాడే రోజు దగ్గర్లో ఉందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హరీశ్ రావుకు సుమిత్రానంద్ పరామర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొని హైదరాబాద్ కోకాపేటలో క్రిస్ విల్లాలోని వారి నివాసంలో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సుమిత్రా నంద్ దంపతులు హరీశ్ రావును పరామర్శించారు. తర్వాత సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్యనారాయణ రావు అకాల మృతి పట్ల విచారం వ్యక్తం చేవారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రూప కెమికల్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు

ప్రతిపక్షం, సంగారెడ్డి, నవంబర్ 2: పఠాన్‌చెరు పారిశ్రామిక వాడలోని రూప కెమికల్స్ పరిశ్రమలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం ధాటికి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంటలు దట్టంగా వ్యాపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఘటన స్థలానికి అగ్నిమాపక అధికారులు చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మూడు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపు చేశారు. స్థానికులని ఘటన స్థలం నుంచి దూరంగా పంపించేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో కార్మికులు పరిశ్రమలో ఎవరూ లేరని సమాచారం. అయితే ఈ ఘటనకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టీజేటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోరం

- ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్ నియామకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ (టీజేటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్‌ను నియమించినట్లు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆదివారం నూతన కమిటీని ఆమె విడుదల చేశారు. విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫెడరేషన్ కృషి చేస్తుందని కవిత తెలిపారు. నూతన కమిటీ నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. కొత్త కమిటీలో బుర్ర రమేశ్ గౌడ్ ఉపాధ్యక్షుడిగా, ఘనపురం దేవేందర్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల ఐక్యత, విద్యా ప్రమాణాల పెంపు దిశగా టీజేటీఎఫ్ చురుకుగా పనిచేయనుంది.

తెలంగాణ జాగృతిలో బీసీ నాయకుల చేరిక

- కవిత పోరాటానికి మద్దతు ప్రకటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, అదే విధంగా బీసీల సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తున్నజాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు బీసీ నాయకుల నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. ఆమె పోరాటంలో తాము సైతం అంటూ పెద్ద ఎత్తున బీసీ నాయకులు జాగృతిలో చేరుతున్నారు. తాజాగా తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నరసింహ, గొరిగే రాధిక, మేడే సరిత , మేడే బాపురాజు,వీరమల్ల శారద, శివ పటేల్ సహా పెద్ద సంఖ్యలో బీసీలు జాగృతిలో చేరారు. వారికి కవిత కండువాలు కప్పి ఆహ్వానం పలికారు . అదే విధంగా చెంగిచర్ల ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు కూడా జాగృతి లో చేరారు. కవిత పోరాటానికి మద్దతుగా ఉంటామని ప్రకటించారు. అటు తెలంగాణ జాగృతి యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్, మియాపూర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు యువకులు మరియు తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్, మూసారాంబాగ్, మేడ్చల్ కు చెందిన విద్యార్థులు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.

కాంగ్రెస్‌కు చెడ్డ పేరు తేవడానికే 'హైడ్రా' జపం

- కొందరు అధికారులు బీఆర్ఎస్ కు సహకరిస్తున్నారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2 : కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కొంతమంది హైడ్రా అధికారులు పనిచేస్తున్నట్లు అనుమానం కలుగుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. 'బీఆర్ఎస్ కు లాభం చేసేలా కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం చేసేలా కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని అనిపిస్తోంది. వారిపైన హైడ్రా చీఫ్ రంగనాథ్ దృష్టి పెట్టాలి. ప్రభుత్వానికి వస్తున్న చెడ్డ పేరుని విపక్షాలు ఎక్కువగా జనంలోకి తీసుకెళ్తున్నాయి. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్తాను. అటువంటి అధికారుల కుట్ర లకు అడ్డుకట్ట వేయాలి. చర్యలు తీసుకోవాలి. దీనిపైన విచారణ కూడా జరగాలి. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నీ ఓడించేందుకు హైడ్రాని అడ్డు పెట్టుకుని కొంతమంది బీఆర్ఎస్ అనుకూల అధికారుల సహకారంతో ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతోంది. ఈ హైడ్రా దాడులను సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారం చేస్తోంది. ఇప్పటిదాకా హైడ్రా దాడులు గురించి మాట్లాడని కేటీఆర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రోజూ హైడ్రా జపం చేస్తున్నారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

ప్రశంసలు, సన్మానాలు బాధ్యతలను పెంచుతాయి

- ఎస్ఈ ఇంజనీర్ చొల్లేటి బుచ్చి రెడ్డి

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 2: ప్రశంసలు, గుర్తింపులు, సన్మానాలు మన బాధ్యతలను మరింత పెంచుతాయని వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ లయన్ చొల్లేటి బుచ్చి రెడ్డి అన్నారు. ఆయన ఎస్ఈగా పదోన్నతి పొందిన సందర్భంగా కరీంనగర్ ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వృత్తి ఉద్యోగాలను అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు నీడ వలె వెంట వస్తుందన్నారు. తను పలు జిల్లాలలో ఉత్తమ ఇంజినీరుగా ప్రభుత్వ అవార్డులు పొందానని, అవార్డు తీసుకున్న ప్రతి సారి రెట్టించిన ఉత్సాహంతో సేవలందించి తృప్తిని మూటగట్టుకున్నానని చెప్పారు. ప్రవాసీ పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులు, గౌరవ సభ్యులు కదారి అనంతరెడ్డి, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, సిహెచ్ రాజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ సౌమ్యుడు, సద్గుణవంతుడు, నిజాయితీకి మారు పేరు అయిన చొల్లేటి బుచ్చి రెడ్డి గత 35 యేండ్లుగా చేస్తున్న అమూల్య సేవలను కొనియాడుతూ త్వరలో చీఫ్ ఇంజనీర్ పదోన్నతి పొందాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ సభ్యులు చొల్లేటి బుచ్చి రెడ్డి దంపతులను సముచితంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డా ఎం ఎన్ రెడ్డి, వి. రవీందర్ రెడ్డి, కె. రవీందర్ రెడ్డి, జి జనార్ధన్ రెడ్డి, వై యశ్వంత్ రెడ్డి, మూల ప్రభాకర రెడ్డి, పి. వెంకట్ రెడ్డి, స్వామి రెడ్డి, సిహెచ్ రమేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాళ్లబండి శంకర ప్రసాద్ రెడ్డి వందన సమర్పణ చేసారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వేగంగా అభివృద్ధి

- షేక్ పేట గేటెడ్ కమ్యూనిటీవాసులతో మంత్రి కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: షేక్‌పేట్‌లోని సత్వ్ గేటెడ్ కమ్యూనిటీవాసులతో మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం సమావేశమయ్యారు. గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వేగంగా ఎదిగిందని, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. పేద కుటుంబాల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల ద్వారా వేలాది మంది మహిళలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. రైతులకు, పరిశ్రమలకు ఇరవై నాలుగు గంటల విద్యుత్ సరఫరా అందించామని చెప్పారు. అనేక నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశామని వివరించారు. బెంగళూరులో ఏడు సంవత్సరాలు పట్టే ఫ్లైఓవర్లను తాము తక్కువ కాలంలోనే పూర్తి చేశామని, కేవలం నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు ముగించామని అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని గూగుల్, చాట్‌జీపీటీ అడిగినా చూపిస్తాయని ఆయన గర్వంగా పేర్కొన్నారు. అలాగే, దేశంలోనే కాకుండా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన ఇన్నోవేషన్ క్యాంపస్ 'టీహబ్' తెలంగాణ సొంతమని చెప్పారు. తమ పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు చేరిందని, ఆరు లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించగలిగామని అన్నారు. రెండేళ్లలో ఏ హామీని అమలు చేయని కాంగ్రెస్ ఇప్పుడు డబ్బులు ఇచ్చి ఓట్లు కొనాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

కంటోన్మెంట్ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రూ.4 వేలకోట్లు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా. నిరూపించలేకపోతే రేవంత్ క్షమాపణలు చెబుతారా? . 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబితేనే 420 హామీలు అమలవుతాయి. పీజేఆర్‌మీద ఇప్పుడు ప్రేమ పొంగుకొచ్చింది. కానీ 2023 ఎన్నికల్లో విష్ణువర్ధన్‌కు ఎందుకు టికెటివ్వలేదు.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

బహుళ

సమీక్ష

ఇనాక్ ఆత్మదర్పణం కల్లూరి 'ఆలోకనమ్'

కుల వ్యవస్థను నిర్మూలించాలని ప్రయత్నించిన గాంధీ, హిందూమత వ్యవస్థని మార్చాలన్న అంబేడ్కర్ కు పొత్తు కుదరక జరిగిన చర్చలు వివాదాస్పదమయ్యాయి. అంబేడ్కర్ సుప్రభాతంలో గాంధీతత్వానికి అంబేద్కరిజానికి భిన్నత్వం లేదని నిరూపించిన విషయం ఇందులో మనం గమనించాలి ఇదే ఆనంద్ విలక్షణ విమర్శనా తత్వం. ఇలా అనేక సాహితీ విషయాలు, విశేషాలు ప్రామాణీకరణలతో పాటు ఎన్నో స్వీయ అనుభవాల అనుభూతుల సమ్మేళనంగా సమీకరించబడ్డ వ్యాస దీపిక, బహుళ ప్రయోజనాల పేటిక, సాహితీ పరిశోధక విద్యార్థుల పాలిట మార్గదర్శి.

డా. అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

'దగా పడిన ప్రతివాడూ దళితుడే' అన్న ఆధునిక దళితవాదం దారిలో పయనిస్తూ, ఆ కోవకు చెందిన అందరికీ సంపూర్ణ భరోసాగా నిలుస్తూ, అసలైన అక్షర వీరుడిగా అన్ని వర్గాలతో ఆరాధించబడతాడని నిరూపించిన దళిత సాహితీ శిఖరం కొలకలూరి ఇనాక్ శిష్యమణి డా. కల్లూరి ఆనందరావు లేఖిని నుంచి వెలువడిన వ్యాసావళి 'ఆలోకనమ్' సాహితీ వ్యాసావళి విమర్శనా పరిమకే పరిమితం కాకుండా స్వానుభవ పూర్వకంగా పరిశోధక దృష్టితో రాసినవి కావడంతో వీటికి మరి కాస్త ప్రత్యేకత అలవడింది, వీటి రచయిత సుమారు రెండు దశాబ్దాల పాటు అడవి బిడ్డల మనసెరిగి బోధించిన 'ఒజ్జ' కావడం మరో విశేషం, వృత్తిరీత్యా తెలుగు భాషా బోధకుడైన ఆనందరావు రచనా శైలి కూడా అదే విధంగా నారికేళ పాకంలా ఉండి పాఠకులను కూడా విద్యార్థులను ఆకర్షించినట్టు ఆకర్షిస్తుంది.

సాహిత్యం, వ్యక్తిత్వానికి సంబంధించినవి

ఇక ఈ 'ఆలోచనమ్' వ్యాసాల విషయానికొస్తే 24 వ్యాసాలలో అర్థ భాగం ఇనాక్ సాహిత్యం, వ్యక్తిత్వానికి సంబంధించినవి అయి ఉండటం మరో విశేషం, ఇనాక్ సాహిత్య పరిశోధకులకు దళిత సాహిత్య అధ్యయన పరిశోధకుల పాలిట కరదీపంగా ఈ పుస్తకం ఉపకరిస్తుంది. ఈ పుస్తకంలో సగభాగం దళిత సాహిత్యానికి సంబంధించిన అనేక ప్రామాణిక విషయాలు చర్చించబడ్డాయి, 1909 సంవత్సరం ఆంధ్రభారతి మాస పత్రికలో ఒక అజ్ఞాత కవి రాసిన 'మాలవాండ్రపాట'ను ఆధునిక తెలుగు సాహిత్యంలో దళితుల బాధల గురించి సమాజానికి చాటిన తొలి రచనగా డా. కల్లూరి ప్రమాణీకరించారు, అనంతర కాలంలో తెలుగు సాహిత్యంలో వెలుగు చూసిన అనేకమంది దళితవాదులు బీర్నుడి మోషే మొదలు కత్తి పద్మారావు వరకు గల దళిత కవులు దళితవాదుల కృషిని రచనలను మనసుతో చదివిన అనుభవంతో విలువైన వ్యాసాలు విశ్లేషణాత్మకంగా రాశారు. వీటి ద్వారా ఈనాటి డా. కల్లూరి సాహితీ విశ్వరూపాన్ని సాక్షాత్కరించవచ్చు ఈయన కవిత్వంలోనే భావుకత మొదలు ఆయనలోనే ప్రేమ తత్వాన్ని జాతీయతలను ఆవిష్కరించి వారి షోడశ కళా ప్రపూర్ణతను చెబుతూ, 'ఆది ఆంధ్రుడు' అంటూ గురువు పట్ల తనకు గల నిలువెత్తు అభిమానాన్ని అక్షరబద్ధం చేశారు.

కవిత్వానికి చిరునామాదారుడే కాదు

ఆచార్య ఇనాక్ అంటేనే అభ్యుదయ కవిత్వానికి చిరునామాదారుడే కాదు, దళిత జీవుల పాలిట భరోసా బావుటా. వారి కవిత్వంలో ప్రత్యేకంగా దళిత మహిళా అభ్యుదయం గురించి చెప్పడంలో అర్థం గమనిస్తే ఇనాక్ కు మహిళల పట్ల గల మాతృభక్తి తెలుస్తుంది, ఆయన దృష్టిలో అమ్మకు భార్యకు అభేదం, జన్మనిచ్చిన తల్లి జన్మ తరించడానికి వెంట నడిచిన భార్య, ఇద్దరు ఆయన దృష్టిలో మాతృమూర్తులే. మానవజాతి దాస్య విముక్తి అందున స్త్రీలు దళితులు సర్వతో ముఖాభివృద్ధి చెందడమే అంతిమ లక్ష్యంగా ఇనాక్ కవిత్వం సాగుతుంది, స్త్రీని



ఆలోకనమ్ (సాహిత్య విమర్శ)
పేజీలు:218, వెల:250/-రూ
ప్రతులకు: డా: కల్లూరి ఆనందరావు
81796 17807

సమాజంలో అత్యున్నత స్థితిలో నిలపాలన్నదే ఆయన సాహితీ కృషి పరమార్థం, అందుకే ఆయన రాసిన కవిత్వం, కథ, నవల, నాటకం, ప్రతి దానిలో స్త్రీని ఉన్నత స్థితిలో ఉంచారు. ఇనాక్ స్త్రీ పూజ కేవలం కవిత్వానికే పరిమితం చేయలేదు, నిజజీవితంలో కూడా నిజం చేసి చూపించి ఆదర్శకవి అయ్యారు, అంటూ తాను దగ్గరగా చూసిన ఇనాక్ నిజ జీవితం ఆధారంగా ధైర్యంగా చెప్పారు ప్రామాణిక రచయిత కల్లూరి. ఇనాక్ ను కవిగా మాత్రమే ఆవిష్కరించి ఆగిపోకుండా ఆయనలోని మరో సృజన కోణం కథా రచయితను కూడా పాఠకులకు పరిచయం చేస్తూ వారు రాసిన కథ 'అస్పృశ్య గంగ' ను విశ్లేషణ చేస్తూ సామాజిక దృక్పథం గురించిన వివరాలు చెబుతూ ఇనాక్ రాసిన ఇతర కథల్లోని వస్తు వైవిధ్యాన్ని అద్భుతంగా కళ్లకు కట్టారు డా. కల్లూరి.

తెలుగు కథా సంపుటి అనంతరం

'అస్పృశ్యగంగ' కథ గల 19 కథల తెలుగు కథా సంపుటి అనంతరం కన్నడం, హిందీ, ఆంగ్లం , భాషలోకి అనువదించబడిన విషయం గుర్తు చేస్తూ, జలాన్ని భూమాత స్తన్యం గా అభివర్ణించి అమ్మ పాల మీద బిడ్డలందరికీ హక్కు ఉన్నట్టే భూమి నుంచి వచ్చిన నీటికి భూమి మీద పుట్టిన అందరికీ అనుభవించే హక్కు ఉందని చెబుతూ, నీరు అంటేనే మాలిన్యాన్ని శుద్ధి చేసేది అలాంటప్పుడు నీటికి మాలిన్యం ఎందుకు ఆపాదించాలి? అని ప్రశ్నిస్తూ స్పృశ్య, అస్పృశ్యం, అనేవి వ్యక్తుల సంస్కారాన్ని బట్టి వస్తుంది. కానీ, కులాన్ని బట్టి కాదు అని 'అస్పృశ్యగంగ' కథ ద్వారా హెచ్చరిస్తారు ఇనాక్. అలాగే, కరుడుగట్టిన కుల వ్యవస్థ అనే బండను పగలగొట్టాలంటే అది ఒక్క శ్రమ వీరులకే సాధ్యం అంటూ శ్రమశక్తి పై గల తన మమకారాన్ని చెబుతూ శ్రమజీవిని అసలైన అందగాడుగా చమట పట్టిన శరీరమే శ్రేష్టమైనది, చెమట జీవే లావణ్యవంతుడు అనడంలో ఇనాక్ శ్రమైక సౌందర్య దృష్టి అర్థమవుతుంది, శ్రమజీవికే పట్టం కట్టాలి అనడంలోని ఆయన సరళమైన సామాజిక దృక్పథం స్పష్టమవుతుంది, సామాజికంగా భారతీయ సమాజం దేవుడు, మతం, కులం, పేరుతో ఎంతగా చీలికలైపోయిందో "అస్పృశ్య గంగ" కథలో ఇనాక్ కళ్ళకు కట్టిన తీరును ఇందులో రచయిత డా కల్లూరి గుర్తు చేశారు.

అంతః సూత్రం ఒక్కటే

ఇనాక్ కథలలోని అంతః సూత్రం ఒక్కటే అది 'పీడిత జనాభ్యుదయం దానివైశిష్ట్యం వేదన నుంచి వెలుగు' అంటూ ఏక వాక్య సమాధానం ఇస్తూనే కథకు కేంద్ర బిందువు వస్తువు కావచ్చు కానీ, అది రచయిత సామర్థ్యంతో ఇతివృత్తమై చదువరుల జీవితాలలోని సంఘటనలతో ముడిబడి విషయం కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది, అంటూ కథా వస్తువు ప్రత్యేకతలను రచయిత విశ్లేషించిన వైనం బాగుంది. అంబేడ్కర్ వాదానికి సంబంధించిన మూడు వ్యాసాల ద్వారా అంబేడ్కర్ మానవతావాదాన్ని ఆవిష్కరించారు, బోయ భీమన్న కలం సృష్టి అయిన 'అంబేడ్కర్ సుప్రభాతం' స్తోత్ర కావ్యం గురించి వివరిస్తూ భీమన్న అంబేడ్కర్ భావజాలాన్ని తనదైన ఆలోచన విధానం సర్ది చెప్పే ప్రయత్నం జరిగిందంటూనే దళిత సమస్యల పట్ల హిందూ మతం పట్ల గాంధీకి అంబేడ్కర్ కు ఏనుగుకు దోమకు ఉన్నంత తేడా ఉంది అంటూ, వర్ణ వ్యవస్థను అంగీకరిస్తూనే కుల వ్యవస్థను నిర్మూలించాలని ప్రయత్నించిన గాంధీ, హిందూమత వ్యవస్థని మార్చాలన్న అంబేడ్కర్ కు పొత్తు కుదరక జరిగిన చర్చలు వివాదాస్పదమయ్యాయి. అంబేడ్కర్ సుప్రభాతంలో గాంధీతత్వానికి అంబేద్కరిజానికి భిన్నత్వం లేదని నిరూపించిన విషయం ఇందులో మనం గమనించాలి ఇదే ఆనంద్ విలక్షణ విమర్శనా తత్వం. ఇలా అనేక సాహితీ విషయాలు, విశేషాలు ప్రామాణీకరణలతో పాటు ఎన్నో స్వీయ అనుభవాల అనుభూతుల సమ్మేళనంగా సమీకరించబడ్డ వ్యాస దీపిక, బహుళ ప్రయోజనాల పేటిక, సాహితీ పరిశోధక విద్యార్థుల పాలిట మార్గదర్శి.

సమీక్షకులు కవి, రచయిత, సాహితీ విమర్శకులు

పరిచయం

స్త్రీ ఉద్వేగాల కవితాధార పద్మ గోలే

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

తనకు తగినంత కాన్వాస్ టైమ్ ఉందని ఆ ప్రఖ్యాత కవయిత్రి తనకు అమ్మమ్మగా పరిచయం చేరుకుంటుంది టి. గోలే. 2020లో కవయిత్రి పద్మ గోలే 107వ జన్మదినం రోజు సందర్భ నేపథ్యంలో తన విశిష్ట కవిత ఆకాశ్వేదికి నివాళిగా,అదే స్కైక్రేజీగా ఆంగ్లంలోకి అనువదించడమని, ఇది చాలా చక్కగా అర్థవంతంగా భాధపడ్డ పైలెట్స్ ఉద్వేగాల చిత్రణగా చెప్పతూ పద్మ గోలే కవిత ఆంగ్లానువాదానికి స్వేచ్ఛను తీసుకున్నానని, నా స్నేహితులు, బాధల ప్రపంచం అదే భావోద్వేగంతో ఆస్వాదిస్తారని ఆశిస్తున్నారు టి.గోలే.

భారతీయాకాశంలో విస్తారంగా కవిత్వమై వెలిగింది మరాఠీ కవి పద్మ గోలే. స్త్రీల ఉద్వేగాలు,కష్టం కన్నీరు చిత్రికపట్టిన కవిత్వం కలం పద్మ గోలే. ఆమె వచనం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలలో ప్రసిద్ధి చెందినది. పద్మావతి విష్ణు గోలేగా పూర్తి పేరు గల పద్మ గోలే 10 జూలై 1913న టాస్ గాంవ్ లో జన్మించారు. ఆమె పద్మ కలం పేరుతో రచనలు చేశారు. ఆమె కలంలోంచి జాలువారిన కవిత్వ సంకలనాలలో ప్రితిపథవర్, నిహర్, స్వప్నజ, ఆకాశవేది, శ్రావణమేఘ ఉన్నాయి. ఆమె నవీ భక్తి, రైగద్వార్ ఏక్ రాత్రి వంటి నాటకాలు రచించించిన గొప్ప నాటక రచయిత కూడా. వల్వం తాతిల్ వాత్ నవల రాశారు. సంపన్న భారతీయ కుటుంబం నుండి వచ్చిన చాలా మంది రచయితలలో ఆమె ఒకరుగా గుర్తింపు పొందారు. గాంధేయ ఉద్యమ ప్రభావం, స్ఫూర్తితో స్త్రీవాద రచయిత్రులుగా వెలిగారు. పద్మ గోలే కవిత్వం రామ్ గణేశ్ గడ్కరీ, త్రింబాక్ బాపూజీ థామ్బే మరింకా యశ్వంత్ దినకర్ పెందార్కర్ రచనలు ప్రభావితం చేశాయి. ఆమె తొలి కవిత్వ సంపుటి ప్రితిపాథావర్ థామ్బే ప్రభావంతో వచ్చింది. అయినప్పటికీ, వెనువెంటనే ఆ అనుకరణ ప్రభావం నుండి బైటపడి తన సొంత డిక్షన్,శైలిశిల్పం థీమ్స్ తో గొప్ప రచనలు చేశారు. పరిణతిలో సుసంపన్నమైన ఆమె గొప్ప రచనలలో నిజాయితీ, ఉద్వేగాల అనుభవం దాగి వున్నది. స్త్రీల సున్నిత, అంతర్ముఖ మానసిక కోణంలో అనేక మనోహర ఆవిష్కరణలు ఆమె రచనల సొంతం. ఆమె కవిత్వం తన ఇష్టం, భావాలోచన, కలల భావ వ్యక్తిత్వ వ్యక్తీకరణలను ప్రతిబింబిస్తుంది. తియ్యని మాధుర్యం, ప్రకృతి దృశ్యాలు. తన కవిత్వ ప్రాధాన్యత అంశాలు.

విభిన్న సామాజిక స్పృహ పద్మ గోలే

భిన్న దృక్కోణం, విభిన్న సామాజిక స్పృహ పద్మ గోలే కవిత్వానికి వన్నె పెంచినవి. సంపన్న కుటుంబం, రాజరిక వారసత్వం గల ఆమెలో అపూర్వ చింతన కలగడం కొంత ఆలోచనలో పడవేసే అంశంగా అనిపించినా ఆమె అసమాన్య ప్రతిభా సృజన సామాన్యులు, సమస్యల గాయాలబారిన పడిన అతివల ఆవేదన పట్ల ప్రేమ కరుణ దయాశీల స్థైర్యం నిండుగా కనిపిస్తుంది. ఆమె కవితలు ఆంగ్లంలోకి ఆమె మనుమరాలు టి. గోలే అనువదించారు. అందులో స్కైక్రేజీ, అవేర్ నెస్,మార్నింగ్, ఆన్సర్, టు ట్రై వంటివి ఉన్నాయి. ఆకాశం కోసం వెర్రిగా అంటుంది టి.గోలే, తను అనువాదంచేస్తూ, తనకు తగినంత కాన్వాస్ టైమ్ ఉందని ఆ ప్రఖ్యాత కవయిత్రి తనకు అమ్మమ్మగా పరిచయం చేరుకుంటుంది టి. గోలే. 2020లో కవయిత్రి పద్మ గోలే 107వ జన్మదినం రోజు సందర్భ నేపథ్యంలో తన విశిష్ట కవిత ఆకాశ్వేదికి నివాళిగా,అదే స్కైక్రేజీగా ఆంగ్లంలోకి అనువదించడమని, ఇది చాలా చక్కగా అర్థవంతంగా భాధపడ్డ పైలెట్స్ ఉద్వేగాల చిత్రణగా చెప్పుతూ పద్మ గోలే కవిత ఆంగ్లానువాదానికి స్వేచ్ఛను తీసుకున్నానని, నా స్నేహితులు, బాధల ప్రపంచం అదే భావోద్వేగంతో ఆస్వాదిస్తారని ఆశిస్తున్నారు.

భావాంతరంగాలు

మేల్కొలుపు: అంతా స్వచ్ఛంగా ఉంది/ ఆ కనులు లోపలివైపు తిరిగాయి/ భావాలన్నీ లోలోపల/ గమనించిన నీలో ఆశ్చర్యం/ అడవి మొక్క అహంగా' ఒక స్టాంజా అనువాదంలో. 'ఆకాశ వెర్రి' మరో కవిత: నా ఆకాశవెర్రిలో నేనొక పక్షిని / ఇక అన్నీ నాకు గరికపోచలా చిన్నవే/ నా కళ్ళలో నింగి తొంగి చూసే / నా ఊపిరిలో/ నా మనసు లోతులలో/ ఆకాశం నా కలలలో మండే నిప్పు / రాత్రి సైరన్ దాని జీవితాన్ని మ్రోగిస్తుంది/ తక్షణమే నా పాదాలు పైకి లేచి / మెరుపు నాట్యంలో రెక్కలు ఎగురుతాయి' అలా సాగే కవితలో ముగింపు స్టాంజాలో 'ఎంత ఎత్తుకు నేను ఎగురగలను? ఇంకెంత దూరం ఉంది? /లేదా ముగింపు సంగం దూరంలో ఉందా? / ఆకాశనావికులకు అలాంటి విచారమే లేదు / లోలోపల బయట మనం ఆకాశంతో మమేకమై / బాధల నీలి ఆకాశంలో కలిసిపోయిన మన ఆకాశ నావికులయిన గాలి పటాలకు(క్రైట్స్) ఆ చింత అసలే ఉండదు' అంటారు పద్మ గోలే, టి.గోలే కూడా ఏక స్వరంలో ఒకే భావనతో. ఆమె రచనలు మహారాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు అందుకున్నవి. అంతటి గొప్ప మనిషిగా కవిత్వంలోనూ జీవితంలోనూ బతికిన పద్మ గోలే 12 ఫిబ్రవరి 1998న మరణించారు.

(పరిచయకర్త కవి, రచయిత, విమర్శకులు)



ఎడారి వసంతం-25
గొలుసు కథ
సింగిడి
పేజీ 7లో

యాది

గూడులేని పిట్ట

అది గూడెందుకు
కట్టుకోలేదో.....
ఎంతకూ అర్థం కాని నాకు
ఏం చేయాలో పాలుపోలేదు

నల్లని బుల్ బుల్ పిట్ట
వొంటరిగా డాబాపై నిద్రిస్తోంది
చిన్న విద్యుత్ బాక్సే దాని నివాసం
పగలంతా...
పచ్చని గార్డెన్ లో కిచ కిచ మంటూ...
కేరింతలు కొడుతూ..
మట్టి చిప్పలోని చల్లని నీళ్లలో స్నానమాడి
రాత్రి కాగానే
వెచ్చగా ఆ బాక్సుపై వాలిపోతుంది

దాని జీవన శైలి కాస్త భిన్నంగానే ఉంది
స్విచ్ వేస్తూ ...
మేము డాబా పైకి వెళ్తుంటామా..
అది గమ్మున అలాగే ఉండి పోతుంది
దాని ధైర్యానికి ఓమారు ముచ్చటేస్తుంది

మొన్నమాత్రం...
దీపావళి టపాసుల మోతకు
బిక్కు బిక్కు మంటూ..
దాని చిన్ని గుండెను
రెక్కల చాటున దాచుకొని
కళ్ళను చీకట్లలో కప్పుకొని
బ్రతుకు జీవుడా అన్నట్టు ఓ ఫోజిచ్చింది
తెల్లారగానే..

ఆందోళన లేని
దాని హావభావాలు చూస్తే..
మౌనంగానే ఓ కొత్తపాఠం నేర్చుకున్నట్టైంది
ఈ రోజు భయం రేపు తెరమరుగవుతుందనీ ..

ఇంతకూ ...
అది గూడెందుకు కట్టుకోలేదో..
ఒకటే వేదన నాకు
అడవుల్ని ఊళ్లు ఆక్రమించాక
వాటికి గూళ్ళు కరువవుతున్నాయేమో..
లేదా.. మనిషితోనో..మానవత్వం తోనో..
దోస్తానా చేయాలనుకుందేమో..

కూడు గూడు ..తోడు నీడ
అన్నీ వున్న మనిషిలో వేల వేల నిట్టూర్పులు

యక్ష ప్రశ్నలు సంధిస్తున్నట్టు
వసారా క్రింద స్వేచ్ఛగా దాని తచ్చాట
ఏదో బానిసత్వాన్ని మోస్తూ..
దానికి ఒక గూడు కట్టలేక
త్రిశంకు స్వర్గం లో నేను..!

-డా. కటుకోర్ఘ్వల రమేశ్
9949083327

సంభాషణ

సాహిత్య సంజాతాల సుజాతామూర్తి

చిటుకుల మైసారెడ్డి
94905 24724

తెలుగు భాష పట్ల మమకారం ఉన్న ఇంట్లో పుట్టినవారు, సాహిత్యానురక్తత కలిగిన వారై తామే భాషా వైభవానికి ప్రతిరూపంగా నిలుస్తారు. అలాంటి వారిలో ఒకరు విశాఖ వాసి ఉండవిల్లి సుజాతా మూర్తి. జన్మనామం ప్రయాగ సుజాత మాతృమూర్తి ప్రయాగ సర్వమంగళ భాషా ప్రవీణ తెలుగు పాండిత్యానికి ప్రతిరూపం. ఆమె దగ్గరి నుంచే సుజాతామూర్తి తెలుగుతో అవినాభావ బంధం ఏర్పడింది. చిన్నప్పటి నుంచే తెలుగు పదబంధాలు, సామెతలు, గడినుడులు పూరించే ఆనవాయితీ. విద్యుత్ ఆగిపోయిన సాయంకాలాలలో మేధోప్రశ్నలు, వాటి జవాబులు, భాషా మజిలీలు, ఇవన్నీ సుజాత బాల్యాన్ని తీర్చిదిద్దాయి. తన తల్లిని అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవడం, భాషతో ఆడుకోవడం ఆమెకు అలవాటే. పాఠశాల దశలో వచన, వక్తృత్వ, పద్య పోటీలలో ఎన్నో బహుమతులు సాధించారు. కళాశాల రోజులలోనే విశాఖ ఆకాశవాణి కేంద్రంలో వ్యాసాలు రాసి చదవడం, ప్రసారం కావడం జరిగాయి. నేటికీ ఆమె వీటిలో పాల్గొంటున్నారు.

విద్యాభ్యాసం, కుటుంబం, వృత్తి

డిగ్రీ చదివారు. వృత్తి రీత్యా ఇంజనీర్ అయిన ఉండవిల్లి వెంకట నారాయణ మూర్తితో వివాహం అనంతరం హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో నివసించి, తిరిగి విశాఖపట్నం చేరారు. అక్కడ స్థానిక 'మీడియా విజన్' టీవీ చానెల్ లో వార్తా చదువరిగా చాలా సంవత్సరాలు స్పష్టతకు చిరునామాగా లైవ్ బులెటిన్ లు అందించారు. బహుముఖ ప్రజ్ఞ బహుమతుల వరద: తెలుగు భాష మాత్రమే కాదు, వేదికా వ్యాఖ్యానం, కవిత్వం, సంగీతం, ఫ్యాషన్ ప్రదర్శన, అన్ని రంగాలలోనూ తన ప్రతిభను చూపారు. హైదరాబాద్ లో 'మా టీవీ' నిర్వహించిన 'మొగుడ్స్ పెళ్లామ్స్' పోటీలో తన జీవిత భాగస్వామితో కలిసి ప్రథమ బహుమతి సాధించారు. చెన్నైలో 'వర్గో' సంస్థ నిర్వహించిన 'సాంప్రదాయ చీరకట్టు' క్యాట్ వాక్ పోటీలోనూ విన్నర్ గా నిలచి తమిళనాట వెండితెర, బుల్లితెర నటీమణులచే అభినందనలు పొందారు. అంతేకాక శతావధానాలు, అష్టావధానాలలో పృచ్ఛకురాలిగా పాల్గొని, వివిధ విశ్వవిద్యాలయాల సదస్సుల్లో పత్రాలు సమర్పించి ప్రశంసలు అందుకున్నారు.

తెలుగు సంస్థల సత్కారం

భారత దేశంలో వివిధ ప్రాంతాలలోనే కాకుండా సింగపూర్, మలేసియా దేశాలలో తెలుగు సంస్థల సత్కారం పొందారు. ఖతార్ దేశం దోహాలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో మొదటి రోజు తన ఆరో పుస్తకం ఆవిష్కరణ రెండవ రోజు పత్ర సమర్పణ గావించి ప్రముఖుల ప్రశంశలు అందుకున్నారు. ఇప్పటికే పత్రికలలో, చానళ్లలో పరిచయ కార్యక్రమాలు అయినప్పటికీ, తాజాగా సుజాతామూర్తి విదేశీయాన (అమెరికా) సందర్భంగా పరిచయం. ఎన్నో ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రోత్సాహమే తన ప్రస్థానానికి మూలబలం అని అంటుంటారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో సుజాతామూర్తి అందుకున్న పురస్కారాలు విశేషం. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలపడం తన కనీస కర్తవ్యమంటారు. 'నేను ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను. సాధించాల్సింది చాలా ఉంది' అన్నారు. అది ఈ 'గ్రాండ్ క్వీన్' సుజాతా మూర్తి లోని ప్రత్యేకత. సుజాతా మూర్తి కవయిత్రిగానే కాకుండా గాయనిగా కూడా పలు వేదికలపై పాటలు పాడుతున్నారు. సాహిత్య పోటీలు, వ్యాసరచనలు, పదబంధాలు, గేయకవితా పోటీలలో బహుమతులు సాధారణం. షటిల్ బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, రింగ్ టెన్నిస్, బీచ్ మారథాన్ లలో పాల్గొని కప్పులు గెలుచుకున్నారు. ట్రెక్కింగ్ సాహసాన్ని కూడా ఆస్వాదించారు. 'ఎంత సాధించినా, సాదాసీదా గృహిణిగానే తృప్తి పొందుతాను' అని ఆమె చిరునవ్వుతో చెబుతారు.

సాహిత్య కృషి, పుస్తకాల రూపంలో

ఇప్పటి వరకు నాలుగు కవితా సంపుటాలు వెలువరించారు. అవి తన్మయధార, కళ్యాణవీణ, కవన వృక్షం,కరోనా కవితలు, రెండు వ్యాస సంపుటాలు ఇలా తన ప్రతి పుస్తకాన్ని తన అత్తమామలైన ఉండవిల్లి ఆదినారాయణ మూర్తి, మహాలక్ష్మి దంపతులకు అంకితం ఇస్తున్నారు. సుజాతామూర్తి ప్రతిభకు సాక్ష్యంగా 'ఆంధ్రశ్రీ', 'తెలంగాణ కళా సరస్వతి', 'లేడీ లెజెండ్', వ్యాఖ్యాన రంగంలో డా. సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా 'ప్రతిభా పురస్కారం',

'జీవన సాఫల్య పురస్కారం' వంటి అనేక అవార్డులు లభించాయి. వివిధ సాహిత్య, సాంస్కృతిక సంస్థలలో సభ్యురాలిగా ఉన్నప్పటికీ, అధ్యక్ష, కార్యదర్శి పదవులను సున్నితంగా తిరస్కరించారు. బుల్లితెర, వెండితెరపై వచ్చిన అవకాశాలను కూడా అంగీకరించలేదు. 'నేనేమీ గొప్ప సాహితీవేత్తను కాదు. కానీ, నా తల్లి గర్భం నుంచి వచ్చిన తెలుగు రక్తమే నన్ను కలం పట్టేలా చేసింది' అంటారు సుజాతా మూర్తి. తన జీవన ధ్యేయం 'తెలుగు భాషా సేవ' అని, తల్లి ప్రయాగ సర్వమంగళ గారికి ఆజన్మాంతం ఋణపడి ఉంటానని చెప్పారు.

(సంభాషణ: సీనియర్ జర్నలిస్ట్)

(ఉండవిల్లి సుజాతా మూర్తి, రచయిత్రి, వ్యాఖ్యాత్రి, గాయని, విశాఖపట్నం, 3472 48428)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

అందరి చూపు బీఆర్ఎస్ వైపే

- పార్టీలోకి ఊపందుకున్న చేరికలు
- కాంగ్రెస్ అరాచక పాలనకు అంతం!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: రెండేండ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ భ్రష్టుపట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్‌ను నాశనం చేసిన రేవంత్ సర్కార్, పథకాలన్నింటినీ బంద్ చేసిందని విమర్శించారు. మహిళలకు రూ.4 వేలు, యువతులకు రూ. 2500, స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ నోటికొచ్చిన హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి ఏడు వందల రోజులైనా ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. పైగా తులం బంగారం ఇస్తామని చెప్పి, ఇప్పుడు మెడలో చైన్ కూడా లాగేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఇప్పుడు వరుసగా జరుగుతున్న చేరికలతో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మెసేజ్ వెళ్తోందని అన్నారు. మాజీ కార్పొరేటర్, బీజేపీ నేత నవతారెడ్డి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరో 500 రోజులలో ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను మళ్లీ తెచ్చుకొని రాష్ట్రాన్ని బాగు చేసుకుందామని చెప్పారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వీరశైవ లింగాయత్ సమాజం

- కార్తీక మాసం వనభోజనాల్లో ఎమ్మెల్యే

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 2 : సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గుట్ట పైన వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమాజ సేవలో కుల సంఘాల పాత్ర మరింత బలపడాలని కోరారు. నియోజకవర్గంలో వీరశైవుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. 30 లక్షల రూపాయల సొంత నిధులతో బీరంగూడ కమాన్ వద్ద మహాత్మ బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ సముచిత ప్రాధాన్యత అందిస్తున్నామని తెలిపారు. హాజరైన అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు నర్సింలు, నియోజకవర్గ అధ్యక్షులు జగదీశ్, రుశ్వంత్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి 10 కోట్లు

- నిధులు మంజూరు చేస్తూ జీఓ విడుదల

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, నవంబర్ 2: స్థానిక అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి 10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇండోర్ స్టేడియంలో సింథటిక్ కోర్టులు, బాస్కెట్ బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీ. హ్యాండ్ బాల్, అధునాతన హంగులతో ఇండోర్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, లైటింగ్ అథ్లెటిక్ కోర్టు నిర్మాణానికి వీటిని వినియోగిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పారు. అడిగిన వెంటనే 10 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- డివైడర్ ను ఢీకొన్న వాహనం

ప్రతిపక్షం, బీబీనగర్, నవంబర్ 2: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైవేపై ఓ వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ వెంటనే అక్కడ నిలుచుని ఉన్న యువతి, యువకుడిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, పక్కనే ఉన్న చెరువులోపడి యువతి మృతి చెందింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

గడువు ముగిసిన పదార్థాల అమ్మకం

- ప్రజల ఆరోగ్యంపై ముప్పు

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 2: గుండాల మండలంలోని పలు గ్రామాల్లో గడువు ముగిసిన కూల్డ్రింక్స్, జ్యూస్ బాటిళ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు,పాలు పెరుగు వంటివి కొన్ని దుకాణాల్లో తెగబడి విక్రయమవుతున్నాయి. లాభాల కోసం కొంతమంది వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. మార్కెట్ లో లభిస్తున్న కొన్ని ప్రముఖ బ్రాండ్ల కూల్డ్రింక్స్ బాటిళ్లపై గడువు తేదీ ముగిసినా అవి ఇంకా షెల్ఫ్‌లపై ఉండడం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది. కొంతమంది తల్లిదండ్రులు ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు, యువత తరచుగా ఉపయోగించే ఈ పాదార్థాలు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు ఇలాంటి గడువు తేది ముగిసిన వి తీసుకుంటే ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని వారు సూచిస్తున్నారు. గడువు ముగిసిన పానీయాల్లో హానికరమైన రసాయన మార్పులు జరగవచ్చు. ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, కడుపునొప్పి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇలాంటి ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గడువు తీరిన వస్తువులను మార్కెట్ లో ఉంచడం చట్టవిరుద్ధమని, ఆహార భద్రత చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ఉచిత చేప పిల్లల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం
- ఒక కోటి 5 లక్షల చేప పిల్లల పంపిణీ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 2: ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ నియోజకవర్గం లోని 223 చెరువుల్లో ఒక కోటి ఐదు లక్షల ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. మత్స్యకారులకు వలలు, ఇతర పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం, పెద్ద చెరువు నందు ఉచిత చేప పిల్లలను ఆదివారం వదిలారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చెవిగోని రజిత శ్రీనివాసులు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం

ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ కు అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ స్వాగతం పలికారు. పట్టణంలోని అటవీ వసతి గృహంలో అదనపు కలెక్టర్, న్యాయమూర్తికి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. న్యాయమూర్తికి స్వాగతం పలికిన వారిలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షం, నిర్మల్

పంటల నష్టం నివేదికను త్వరగా అందజేయాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 2: మొంథా తుఫాను వల్ల భారీ వరదల కారణంగా నష్టపోయిన పంటల వివరాల అంచనాను వ్యవసాయ అధికారులు త్వరగా పూర్తి చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలో వరదలతో నష్టం జరిగిన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ముంపు ప్రభావంతో ఏయే పంటలకు ఎంతెంత నష్టం జరిగిందనే వివరాలను వ్యవసాయ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంగపహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలో పంటలు నష్టపోయి పొలాల వద్ద ఉన్న వంగపహాడ్, బైరాన్ పల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులతో కలెక్టర్ మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుని పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్య పడొద్దన్నారు. పంటలకు జరిగిన నష్టం వివరాల నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరద ముంపుతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సర్వే నెంబర్ల ప్రకారం నివేదికను త్వరగా అందజేయాలన్నారు. బైరాన్ పల్లి వంగపహాడ్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు వరద ధాటికి దెబ్బతినగా జిల్లా కలెక్టర్ పరిశీలించి త్వరగా మరమ్మతులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడిఏ ఆదిరెడ్డి, ఏవో అనురాధ, ఏఈఓ అనూష, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాస్తున్నారు

- సీఐటీయూ మండల సమావేశం
- మండల కన్వీనర్ గా నగేష్

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 2: యేండ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను పాలక పక్షాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. చిట్యాలలో ఆదివారం జరిగిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాల్సిన పాలక పక్షాలు పన్నెండు, పది గంటల పనిని కొనసాగించే కుట్ర జరుగుతోందని అన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలన్నారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు సీఐటీయూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు ఏళ్ళ మారయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, వివిధ ప్రజా సంఘాల, ట్రేడ్ యూనియన్ నాయకులు పబ్బు స్వామి, వడ్డెపల్లి శంకర్, సుక్క నర్సింహా, కల్లూరి నారాయణ రెడ్డి, పాల లక్ష్మయ్య, జనపాల జ్యోతి, సిరిపంగి యాదయ్య, అరూరి మల్లేష్, బద్దుల రమేష్, రుద్రవరం నర్సింహా, మేడి శోభ, బండారు శంకరయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ చిట్యాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేయగా, నూతన మండల కన్వీనర్ గా జిట్ట నగేష్ ఎన్నికయ్యారు.

ఎస్టీపీ ఏర్పాటు వద్దు

ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్ 2 : ఉప్పల్ లోని పలు కాలనీలలో కొన్నిరోజులుగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉప్పల్ కురుమనగర్, లక్ష్మీ నర్సింహ్మా కాలనీల సమీపంలో చేస్తున్న మురుగు శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణమే దీనికి ప్రధాన కారణం. స్థానికులు ఎస్టీపీని తమ కాలనీల సమీపంలో నిర్మించవద్దని ఆందోళన చేస్తున్నారు. ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అక్కడికి వెళ్లి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల వాసులు, ప్రజాప్రతినిధులుగా మేం ఎవరం అభివృద్ధిని, ఎస్టీపీ నిర్మాణాన్ని వ్యతిరే కించడం లేదు. కాలనీలవాసుల ప్రయోజనం దృష్ట్యా మూసీ సమీపంలో నిర్మించాలని కోరుతున్నాం. రకరకాల కాలుష్యంతో ఇప్పటికే కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దీనిని గుర్తించాలి అని అన్నారు.

పెద్దమ్మతల్లి దేవాలయ వార్షిక మహోత్సవం

- హాజరైన వరంగల్ ఎంపీ కడియం కావ్య

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 2: హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో ఐదవ వార్షికోత్సవోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లి సమేత పెద్దిరాజు స్వామి వార్ల కళ్యాణ మహోత్సవంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఎంపీకి దేవస్థాన కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఎంపీ డా.కడియం కావ్య పెద్దమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆరోగ్యంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని అన్నారు. గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేసిన దేవాలయ అభివృద్ధికి, సదుపాయాలపై అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ కమ్యూనిటికీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కమిటీ అధ్యక్షులు పృథ్వీరాజ్, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, మాజీ అధ్యక్షులు పెద్దమ్మ నరసింహరాములు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, వీసం సురేందర్ రెడ్డి, జన్ను రవీందర్, పుల్ల రవీందర్, కిరణ్, సురేష్, గంగన్న, రాజు, మహిళ డివిజన్ అధ్యక్షురాలు అనూష ఇతర ప్రజా ప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గొంతు కోసి భార్య, కూతురు, వదిన హత్య

- అనంతరం ఉరి వేసుకొన్న నిందితుడు

ప్రతిపక్షం, పరిగి, నవంబర్ 2: వికారాబాద్ జిల్లా కులకచర్లలో దారుణ ఘటన వెలుగు చూసింది. భార్య, కూతురు, వదినను వేపూరి యాదయ్య గొంతుకోసి హత్య చేశాడు. హత్యల తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతులు అలివేలు (32), హనుమమ్మ (40) శ్రావణి (10), యాదయ్య (38)గా పోలీసులు గుర్తించారు. అయితే.. యాదయ్య మరో కూతురిని కూడా చంపే ప్రయత్నం చేయగా, ఆమె తప్పించుకున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భార్య అలివేలు, వదిన హనుమమ్మ, కూతురు శ్రావణిని యాదయ్య కొడవలితో గొంతుకోసి హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. మరో కూతురు అపర్ణ తప్పించుకుంది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. రోజువారీ కూలీ పనిచేసే యాదయ్య భార్య అలివేలుపై నిత్యం అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడేవాడని స్థానికులు చెబుతున్నారు. రాజీ చేసేందుకు వచ్చిన వదిన హనుమమ్మపై అక్కడే ఉన్న పిల్లలపై యాదయ్య దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించారు.



కొందరు అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చి, బీఆర్ఎస్ కు లాభం కలిగేలా చూస్తున్నారనే అనుమానం ఉంది. హైడ్రా అంశాన్ని తెరపైకి తెచ్చి జూబ్లీహిల్స్‌లో నవీన్‌ను ఓడించే కుట్ర జరుగుతోంది. ఎన్నికలప్పుడే కేటీఆర్ కు హైడ్రా ఎందుకు గుర్తుకొచ్చిందో చెప్పాలి. బీఆర్ఎస్ అనుకూల హైడ్రా అధికారుల వల్ల ఎవరైనా నష్టపోతే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తా.

- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

ప్రాంతీయం

యాదవుల ఐక్యతకు నిదర్శనం సదర్ సమ్మేళనం

- గొర్రెకాపరుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి యాదవ్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 2: సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పూర్ బాల హనుమాన్ దేవాలయం సమీపంలో శ్రీకాంత్ యాదవ్, కపిల్ యాదవ్, సాగర్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సదర్ ఉత్సవాలకు రాష్ట్ర యాదవ సంఘ నాయకులు, రాష్ట్ర గొర్రెకాపరుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్, బీజేపీ నాయకులు దూద్ది శ్రీకాంత్ రెడ్డి, వంగ రాజేశ్వర్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు నిదర్శనం ఈ సదర్ సమ్మేళనం పేర్కొన్నారు. మన సమాజం ఎప్పటికప్పుడు ఐక్యతతో ముందుకు సాగాలి. మన ఆచారాలు, సంప్రదాయాలు మన గౌరవానికి ప్రతీకలు. యువత సామాజిక సేవలో ముందుండి, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తన వంతు పాత్ర పోషించాలన్నారు. సదర్ సయ్యాటలో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, "సమాజ ఐక్యతే మన బలమైన శక్తి" అని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ పండుగ వాతావరణాన్ని గ్రామాల వరకూ విస్తరించేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు దున్నపోతులను సుందరంగా అలంకరించి కాలనీలో తిప్పుతూ విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో జలదిగ్బంధంలో వన దుర్గమ్మ

- రాజగోపురంలోనే ఉత్సవ విగ్రహానికి పూజలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మ ఐదు రోజులుగా గంగమ్మ ఒడిలోనే ఉంది. సింగూరు ప్రాజెక్టు నుండి గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో ఆలయం చెంత గంగమ్మ ఉధృతంగా ప్రవహిస్తుంది. గంగమ్మ శాంతించకపోవడంతో వనదుర్గమ్మ జలదిగ్బంధంలోనే ఉంది. ఆలయం చెంత ఉన్న ఏడు నదీ పాయలు పరవళ్ళు తొక్కుతున్నాయి. వనదుర్గా ప్రాజెక్టు పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది. ప్రాజెక్టు పైనుంచి గంగమ్మ పరవళ్ళు తొక్కుతూ వనదుర్గామాత ప్రధాన ఆలయం ముందున్న ఏడుపాయల్లో ఒకటైన నదీ పాయ ఉధృతంగా ప్రవహించడంతో ఆలయానికి రాకపోకలు స్తంభించాయి. దీంతో బుధవారం ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. రాజ గోపురంలో వనదుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అమ్మ దర్శనం కల్పిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో భారీగా వచ్చిన భక్తులు రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని మొక్కులు చెల్లించున్నారు.నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టగానే మూలవిరాట్ అమ్మవారి దర్శనం యధావిధిగా పున:ప్రారంభిస్తామని ఆలయ అర్చకులు,అధికారులు పేర్కొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 2: రైతులకు న్యాయం చేయాలంటే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టి మిల్లులకు తరలించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం గునుకులపల్లె గ్రామంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బరిగెల మోహన్, గూళ్ల రాజు,బుర్ర శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కూన పోచయ్య, రైతు సంఘం నాయకులు కాంతల శ్రీనివాస్ రెడ్డి, కూన ముత్తయ్య, బజారు రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, అల్వాల శ్రీనివాస్ రెడ్డి, కూన భూమయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

బడుగు జీవుల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ నేత ఆవుల రాజిరెడ్డి

ప్రతిపక్షం, నర్సాపూర్, నవంబర్ 2:- రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసమే ఇందిరమ్మ ఇళ్లను ప్రవేశపెట్టిందని నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండల కేంద్రంలోని సికింద్రాపూర్ గ్రామంలో తోటి రాములమ్మ లక్ష్మయ్య గౌడ్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరెడ్డి, పులిమామిడి నవీన్ గుప్తా, గోమారం మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు ఆంజనేయులు మల్లేష్ యాదవ్ లస్కరి ఆంజనేయులు, రాజశేఖర్ మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి

- విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
- ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 2: విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తూ తల్లిదండ్రులు పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలని ట్రాఫిక్ శాఖ విజ్ఞప్తి చేసింది. పాఠశాల యాజమాన్యాలు భద్రతా నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు స్వయంగా పరిశీలించాలని సూచించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ "మన పిల్లల రక్షణ మన చేతుల్లోనే ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణించే బస్సులు అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాయా అని తప్పక పరిశీలించాలి. ఏవైనా లోపాలు గమనించినట్లయితే వాటిని వెంటనే సరిచేయమని యాజమాన్యాలను కోరాలి.'' స్పందించకపోతే ఆర్టీవో లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రతి బస్సుపై ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడే ఫోన్ నంబర్ స్పష్టంగా ప్రదర్శించే విధంగా యాజమాన్యాలను డిమాండ్ చేయాలని ఆయన చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణ కోసం సచేతనంగా వ్యవహరించాలని, ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ప్రయాణ భద్రత కేవలం పాఠశాల యాజమాన్యాల బాధ్యత మాత్రమే కాదు, తల్లిదండ్రుల బాధ్యత కూడా అదే స్థాయిలో ఉందని వారు స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదు. ప్రతి తల్లి దండ్రి స్వయంగా పరిశీలించి స్పందిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.

బీజేపీ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 2: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం సిద్దిపేట పట్టణంలో శాంతియుతంగా ఆందోళన చేపట్టాలని నిర్ణయించిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన హక్కు ప్రతి పౌరుడికి ఉందని, సీఎం వ్యాఖ్యలపై అభిప్రాయాన్ని వెల్లడించడానికే కార్యకర్తలను అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గం అని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కెమ్మసారం సంతోష్ ధాబా నరేష్,గాందే సంతోష్,ఎర్వ గణేష్,వెంకట్ రావు,అరిగే యాదగిరి,కిరణ్,మహేందర్ తదితరులు ఉన్నారు.

హరీష్ రావుకు సీనియర్ జర్నలిస్టుల పరామర్శ

ప్రతిపక్షం సిద్దిపేట, టౌన్, నవంబర్ 2: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. సిద్దిపేట సీనియర్ జర్నలిస్టులు హరీష్ రావును పరామర్శించారు. సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యమ్మగారి సత్యనారాయణరెడ్డి, మదూరీ శ్రీరామ్, ఆకుల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొందుగుల శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్‌లో గజ్వేల్ బీఆర్ఎస్ నేతల ప్రచారం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 2: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపుకై మద్దతు తెలుపుతూ ఆదివారం ఎర్రగడ్డ డివిజన్లో గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావు, మాజీ జడ్పీటీసీ అర్జున్ గౌడ్, బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు దేవగారి నాగరాజు, మాజీ ఎంపీపీ అమరావతి, మాజీ కౌన్సిలర్లు మరికంటి కనకయ్య, బొగ్గుల చందు, కొమ్ము నవీన్ కుమార్, మాజీ ఎంపీపీ రమేష్‌గౌడ్, హైదర్ ఇక్బాల్, వర్గల్ రవీందర్ రెడ్డి, రమేష్,ఎర్రవల్లి మాజీ సర్పంచ్ బాలరాజు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి

మానవత్వాన్ని చాటిన ట్రాఫిక్ హోంగార్డ్

ప్రతిపక్షం, గజ్వేల్ (ములుగు), నవంబర్ 2: ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో దుబ్బాక గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఆపరేషన్ సమయంలో "ఏ" పాజిటివ్ బ్లడ్ అవసరము ఉన్నదని పోలీస్ మిత్రులు ద్వారా సమాచారం తెలుసుకున్న జిల్లా హోంగార్డు సంఘం అధ్యక్షుడు నరేందర్ రెడ్డి వెంటనే స్పందించి, ఆదివారం ఆర్వీఎం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న వ్యక్తి కుటుంబ సభ్యులు హోంగార్డుకు కృతజ్ఞతలు తెలిపారు.

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 2: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్, బోరబండలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మైనంపల్లి హన్మంతరావు, సినీ యాక్టర్ సుమన్ అత్తు ఇమామ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతున్నారని అన్నారు. ఇన్నేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదు అని అన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్, హర్షద్, బబ్బు, నజ్జు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఫోటో, వీడియో జర్నలిస్టులు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును పరామర్శించారు. ఆదివారం ఆయన నివాసంలో తండ్రి సత్యనారాయణకు జర్నలిస్టులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోటో, వీడియో జర్నలిస్టులు బింగి శ్రీను, సతీష్, శ్రీను,గిరి, రిపోర్టర్స్ మధు, రాజు ఉన్నారు.

- ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్

కార్తీక శోభను సంతరించుకున్న నాచగిరి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 2: కార్తీక మాసం ద్వాదశి పురస్కరించుకొని ఆదివారం నాడు వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. నారసింహ నామస్మరణలతో క్షేత్రం మారుమ్రోగింది. తెల్లవారుజాము నుండే భక్తులు హరిద్రనది (హల్దీ వాగు) తీరమున మరియు కోనేరు యందు పుణ్యస్నానములు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ ఆవరణంలో 180 జంటలు సత్యనారాయణ స్వామి వ్రతములు జరిపించారు. 13 స్వామి వారి కళ్యాణములు 11 నిజాభిషేకాలు జరిగాయి. సాయంత్రం భక్తులచే కార్తీక దీపోత్సవం ఆకాశ దీపారాధన జరిపించడం జరిగినది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 2: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 18,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు. రైతులు పంట తెచ్చిన రోజు రిజిస్టర్లలో ఏ రోజు తెచ్చారు, తెచ్చినప్పుడు ఎంత తేమశాతం ఉంది అనే వివరాలను నమోదు చేసుకుని, సీరియల్ నెంబర్ల వారీగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. బరువు కొల్చే యంత్రాలు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకొని ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట కల్వకుంట పిఎసిఎస్ సీఈవో గోపాల్ రెడ్డి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను అత్యున్నత స్థానంలో నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోంది. 20 నెలల వ్యవధిలోనే రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. బీఆర్ఎస్ పాలనలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నాం.

- మంత్రి శ్రీధర్ బాబు

విశ్వ వీక్షణం

ప్రధాని మోడీ బడా వ్యాపారుల చేతిలో బందీ

- తీవ్ర ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భయపడటమే కాకుండా బడా వ్యాపారుల చేతిలో ప్రధాని మోడీ రిమోట్ కంట్రోల్‌గా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. బిహార్‌లోని బెగుసరాయ్ లో ఆయన ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. జీఎస్టీ అమలు, సంస్కరణలు, పెద్దనోట్ల రద్దు వంటి నిర్ణయాలు చిరు వ్యాపారులను దారుణంగా దెబ్బతీసాయన్నారు. అదే సమయంలో అవి బడా పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చాయని కూడా చెప్పారు. తాము అధికారంలోకి వస్తే చిన్న వ్యాపారాలను బలోపేతం చేస్తామని, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా సమాజంలోని అన్నివర్గాలకు ఉపయోగకరంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలను పట్టించుకోకుండా రీల్స్ చూస్తూ ఉండేలా ప్రధాని మోడీ యువతను ప్రోత్సహిస్తున్నారని రాహుల్ విమర్శించారు. ప్రధాని తనది 56 అంగుళాల ఛాతీ అని చెప్పుకుంటారని, పనులు మాత్రం అలా ఉండవన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేయగానే మోడీ గాబరాపడి, భయపడ్డారని ఎద్దేవా చేశారు. 'ఆపరేషన్ సిందూర్' నిలిపేయాలని ట్రంప్ చెప్పగానే నిలిపివేశారని పేర్కొన్నారు. మోడీ రిమోట్ కంట్రోల్ అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తల చేతులలో ఉందని రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

పాకిస్తాన్, కాంగ్రెస్ రెండూ షాక్‌లో ఉన్నాయి

- సంచలన వ్యాఖ్యలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 2: 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన షాక్ నుంచి అటు దాయాది దేశం పాకిస్తాన్, ఇటు కాంగ్రెస్ పార్టీ రెండూ కోలుకోలేక పోయాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. పాకిస్తాన్ మీద దాడులు జరుగుతున్నపుడు కాంగ్రెస్ పార్టీని నడిపే కుటుంబం నిద్రలేని రాత్రులను గడిపిందని ఎద్దేవా చేశారు. ఆదివారం బిహార్‌లోని అర్రా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. పాక్ లో ఉన్న ఉగ్రవాదులను అంతం చేస్తామని తాము ఇచ్చిన మాట ప్రకారమే 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించామని స్పష్టం చేశారు. ఆ సైనిక చర్యను చూసి యావత్ భారతావని గర్వించిందని చెప్పారు. జమ్మూకశ్మీరులో ఆర్టికల్ 370ని రద్దు చేసే ధైర్యాన్ని గత ప్రభుత్వాలు చేయలేకపోయాయని, తాము చేసి చూపించానని తెలిపారు. తాము వారి కంటే ఎక్కువ జనాదరణ పొందుతున్నామనే అక్కసుతో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌నూ కాంగ్రెస్ పార్టీ అవమానించిందని మోడీ ఆరోపించారు. బిహార్ ఆర్జేడీ పాలనలో 'జంగిల్ రాజ్' కొనసాగిందని, 37వేల మంది కిడ్నాప్‌కు గురయ్యారని, ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు కూడా బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. సిక్కుల నరమేధం అనగానే కాంగ్రెస్ పార్టీ గుర్తుకొస్తుందన్నారు. 1984 సంవత్సరంలో నవంబరు 1, 2 తేదీలలోనే ఆ నరమేధం జరిగిందన్నారు. ఆ నరమేధానికి కారకులైనవారికి ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ పదవులు ఇస్తోందన్నారు. ఈ పాపాలకు పాల్పడినందుకు కాంగ్రెస్, ఆర్జేడీలకు అస్సలు పశ్చాత్తాపం లేదని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

బిహార్‌లో జోరందుకున్న రాజకీయ ప్రచారం

- మరో మూడు రోజులలో తొలి దశ పోలింగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోరుకు బిహార్ సమాయత్తమవుతోంది. ఈ నెల ఆరున మిథిలాంచల్, కోసీ, ముంగేర్ ప్రాంతాలలోని 18 జిల్లాలలో ఉన్న 121 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. తొలి విడత పోలింగ్ జరగనున్న జాబితాలో పాట్నా, భోజ్‌పూర్, బక్సర్, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, ముజఫర్‌పూర్, వైశాలి, దర్భంగా, సమస్తిపూర్, మాధేపురా, సహర్సా, ఖగారియా, బెగుసరాయ్, ముంగేర్, లఖీసరాయ్, షేఖ్‌పురా, నలంద జిల్లాలు ఉన్నాయి. మిథిలా, కోసి, ముంగేర్ డివిజన్ లోని ఈ సీట్లలో ఎన్డీయే కూటమి హవా ఉందని రాజకీయ పరిశీలకుల మాట. 2020లో 121 సీట్లకుగానూ 70 సీట్లను ఎన్డీయే కూటమే గెల్చుకుంది. తాజాగా, 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ద్వారా వ్యాపారాలకు రూ.10 వేల సాయం చేస్తామనే హామీ కూటమికి కలిసి రావచ్చని భావిస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్జేపీ, ఉపేంద్ర కుశ్వాహాకు చెందిన ఆర్ఎల్ఎం చేరికతో కూటమి బలంగా కనిపిస్తోందంటున్నారు. కాగా, యువత, మహిళలను ఆకట్టుకునేందుకు మహా ఘట్ బంధన్ సీఎం అభ్యర్థి, ఆర్జేడీ అగ్రనేత తేజస్వియాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి 'యాదవ్-ముస్లిం' ఓటు బ్యాంకు ప్రధాన బలంగా నిలిచే అవకాశాలున్నాయి.

ఎన్నికలలో హింసను ఈసీ సహించబోదు

- రాజకీయ పార్టీలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వార్నింగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 2: జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసు బిహార్ లో కలకలం సృష్టించింది. ఈ కేసులో జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పార్టీలకు వార్నింగ్ ఇచ్చారు. హింసను ఎట్టి పరిస్థితులలోనూ సహించబోమని హెచ్చరించారు. బిహార్ ప్రజలు ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఓటర్లు శాంతియుతంగా ఓటు వేసేలా చూసేందుకు ఈసీ సిద్ధంగా ఉందని అన్నారు. ఉత్తరప్రదేశ్ ఐఐటీ కాన్పూర్ లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో జ్ఞానేశ్ కుమార్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు 243 మంది రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు, కలెక్టర్లు, అధికారులు, ఎస్పీ, ఎస్ఎస్పీ, పోలీసులు సిద్ధంగా ఉన్నాని చెప్పారు. ఎన్నికల కమిషన్‌కు పాలకపక్షం, ప్రతిపక్షం రెండూ సమానమేనని తెలిపారు. ఈసీ ఎప్పుడూ తటస్థంగా వ్యవహరిస్తుందని అన్నారు. బిహార్ రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతాయని, యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తాయని ఆశిస్తున్నానని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

68 రోజులు దేశ రాజధానిని వదిలి వెళ్లండి

- ఎయిమ్స్ మాజీ పల్మోనాలజిస్ట్ గోపీచంద్ ఖిల్నాని సూచన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 2: దేశ రాజధాని ఢిల్లీలో వారం రోజులుగా వాయు నాణ్యత రోజుకోజుకూ దిగజారుతోంది. ఆదివారం నాడు ఉదయం ఏడు గంటలకు ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీకి పడిపోయింది. ఏకంగా 377గా నమోదైంది. మరికొన్ని ప్రాంతాలలో 387కు చేరింది. ఉదయం 10 గంటలకు ఆనంద్ విహార్, చాందిని చౌక్, నెహ్రూనగర్, ఆర్కే పురం, రోహిణి సహా అనేక ప్రాంతాలలో 400 దాటింది. దీంతో ఢిల్లీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఎయిమ్స్ మాజీ పల్మోనాలజిస్ట్ గోపీచంద్ ఖిల్నాని కీలక సలహా ఇచ్చారు. వీలైతే 68 వారాల పాటు ఢిల్లీని వదిలి వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు డిసెంబర్ చివరి వరకు ఢిల్లీ నగరాన్ని వీడితేనే మంచిదని అన్నారు. లేదంటే ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని హెచ్చరించారు. అందరూ ఢిల్లీ వీడడం వీలు కాకపోయినప్పటికీ, దీర్ఘకాలికంగా ఊపిరితిత్తులు, గుండె జబ్బులతో బాధపడేవారు, ఆక్సిజన్ పీల్చుకోవడంలో ఇబ్బందిపడేవారు తక్కువ కాలుష్యం ఉన్న ప్రదేశాలకు వెళ్లడం మంచిదన్నారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం క్రోనిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ 90 శాతం కేసులకు పొగాకు లేదా ధూమపానంతో వచ్చేవని, ఇప్పుడు 50 శాతం ఇండోర్, అవుట్ డోర్ వాయు కాలుష్యంతో వస్తున్నాయన్నారు. గతంలో 80 శాతం కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు పొగాకు, ధూమపానం తాగడంతో సంభవించేవని, నేడు 40 శాతం లంగ్స్ క్యాన్సర్ కేసులు అస్సలు ధూమపానం చేయని వ్యక్తులలో కనిపిస్తున్నాయన్నారు. వాయు కాలుష్యం వల్ల చిన్న పిల్లలకు ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయని గోపీచంద్ ఆందోళన వ్యక్తం చేశారు.



ఎడారి వసంతం-25

గొలుసు కథ

యశోద గొట్టిపర్తి
హైదరాబాద్



జరిగిన కథ:

తన అమ్మానాన్నల వివరాలు ఇప్పుడు తప్పకుండా చెప్పాలని పట్టు పట్టడంతో, సిరి వాళ్ళ అమ్మానాన్నల గురించి చెప్తుంది ఝాన్సీ. తన కొడుకు ప్రణవ్ ఫేక్ వీడియో గురించి సూర్య ఫోన్ లో చెప్పిన విషయాలు ఆలోచించాక అంజలికి కనువిప్పు కలుగుతుంది. కూతురుని తీసుకొని తను కూడా ఇండియా బయలుదేరింది. బంగ్లా పై అంతస్తుకి లాఘవంగా చేరుకుని, ముసుగు వ్యక్తిని బంధిస్తుంది జ్వాలాముఖి. (ఇక చదవండి)

సంకేత్ సిరిమువ్వతో సంతోషంగా మాట్లాడుతున్నాడు. కానీ అతన్ని ఇందిర ఎందుకు తీసుకు వచ్చిందో అని లోలోపల ఝాన్సీ ఆందోళన పడుతోంది. అది గమనించిన ఇందిర జరిగిన విషయం ఆమెకు చెప్పాలని ఝాన్సీని గదిలోకి పిలిచి, "మా పాత శాలలో ప్రతి ఆరు నెలలకొకసారి పిల్లల ఆరోగ్య స్థితిగతుల పరీక్షలు జరుగు తుంటాయి. ఒకరోజు పిల్లల కంటి దృష్టి పరీక్ష కోసం ఇద్దరు డాక్టర్లు వచ్చారు. అయితే, అప్పుడప్పుడు సిరిమువ్వ కూడా చదవడం, రాయడం తడబడినట్టు అనిపించేది. వంశ పారంపర్యంగా తనకి అంధత్వం వచ్చే ఛాన్స్ ఉంటుందని చెక్ చేయించాము. వింటున్న ఝాన్సీ కంగారుగా "అవునా ఇందిరా! ఇప్పుడు సిరి కండ్లకు ఏ లోపం లేదుగా" అని ఆందోళన పడింది. "పరీక్ష చేసి దగ్గరి చూపుకు కొన్ని పాయింట్స్ తక్కువ ఉన్నాయని, ఇప్పుడు లేటెస్ట్ గా వస్తున్న కాంటాక్ట్ లెన్స్ సెట్ చేశారు. వాటి వల్ల ఆమె సైట్ ప్రాబ్లం గురించి ఎవరికీ తెలియదు, కళ్ళుకూడా ఆరోగ్యంగా ఉంటాయి. అయితే.. ఈ సంకేత్ కూడా అక్కడికి చెకప్ కోసం రావడం గమనించాను. సిరి దగ్గర ఉంటే తన కూతురు అనుకుంటాడనుకుని వేరే అమ్మాయిలతో తిరిగి వస్తుంటే నన్ను చూచి దగ్గరకు వచ్చాడు. తనని తాను పరిచయం చేసుకుని 'నాకూతుర్ని చూడాలని ఉంది. ఇందిరగారు! నేను పూర్తిగా మారిపోయాను. అటు నా దీక్ష చనిపోవడం, ఇటు నా బిడ్డకూడా దూరం కావడంతో నేను బాగా కుమిలి పోతున్నాను. చదువుకునే రోజులలో మీరు దీక్ష రూమ్ మేట్ కదండీ.. నా కూతురు గురించి చెప్పండి ఎక్కడుంది?' అని ప్రాధేయపడ్డాడు.

కానీ అతని గురించి తెలిసిన దానిని కాబట్టి 'నువ్వెవరో నాకు తెలియదు, దీక్ష తెలియదు. నీ బిడ్డకు నాకు ఏం సంబంధం? తన గురించి నన్నడుగుతావేంటి' అని గద్దించాను..

అతను నిరాశ చెందాడు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి 'సరే నిజంగా మీకు తెలియదా? అయితే ఇప్పుడైనా చెప్పండి' అంటూ తన జేబులో నుంచి ఒక ఫోటో తీసి చూపించాడు. దానితో నేను ఖంగు తిన్నాను. కానీ నా కంగారును కనబడనీయకుండా 'మీ ఇద్దరికీ సంబంధం ఏమిటి? నన్ను ఎందుకు పదేపదే విసిగిస్తున్నావు? ఎవరు నువ్వు' అన్నాను. అప్పుడు తను క్రూరంగా నవ్వాడు. 'హలో మేడం.. నీ స్కూల్ స్టూడెంట్ నా దగ్గర బందీగా ఉన్నాడు. ఇప్పుడు నువ్వు నా కూతుర్ని చూపించకపోతే నీ స్టూడెంట్ నా చేతుల్లో ఏమవుతాడో ఊహించుకో, ఈ విషయం బయట ఎవరికైనా తెలిసినా, లేదా పోలీసులకు చెప్పినా ఆ స్టూడెంట ప్రాణాలతో దక్కడు. నీకు, నీ స్కూలుకు భవిష్యత్తు ఉండదు. నా కూతురును నాకప్పగిస్తేనే, నీ స్టూడెంట క్షేమంగా ఇంటికి వస్తాడు' అన్నాడు.

'నన్ను భయ పెట్టటానికి ఇప్పటికిప్పుడు అలా అబద్ధాలు చెపుతున్నావా!' అని అనాలని నోటి వరకు వచ్చినా మాట బయటకు అనలేదు. తను చాలా దుర్మార్గుడని దీక్ష ఎన్నోసార్లు చెప్పింది. వాడు అన్నంత పనీ చేస్తాడనీ, ఇక తప్పదన్నట్లు మా కారులో సంకేతును తీసుకునివచ్చాము" అంటూ జరిగిందంతా చెప్పింది ఇందిర. అంతా విన్న తర్వాత ఝాన్సీ ఆశ్చర్యపడింది. ఇప్పుడు ఆమె మనసు కుదుటపడింది.

*****

సూర్య సంతోషంగా కొడుకును దగ్గరికి తీసుకుని నుదుటి మీద ముద్దు పెట్టాడు. "ప్రణవ్! నీలో ఏ తప్పూ లేదు. నీమీద ఎన్ని అభాండాలు వేసినా మేం నమ్మం. నువ్వు ప్రేమించే సిరితో నీ పెళ్లి జరిగేటట్లు చూస్తాలే. తను ఇప్పుడు అనాధ కూడా కాదు. వాళ్ళ అమ్మానాన్న ఎవరో తెలిసిపోయింది" అన్నాడు. ప్రణవ్ కి తన చెల్లి ఫోన్లో పంపిన మెసేజ గుర్తుకు వచ్చింది. ఏదో సర్ప్రైజ్ చెప్తానంది. ఒకవేళ మమ్మీకి ఇష్టమైన అమ్మాయిని చేసుకోవాలని వెంటనే అమెరికా రమ్మని చెపుతుందేమోనని ముఖం చిన్న బుచ్చుకున్నాడు.

****

సిరిమువ్వ సంతోషంగా ఉంది. తాను ఇన్నాళ్ళూ పడిన అవమానాలు, పొందిన అనాదరణలు పూర్తిగా మరచిపోయి, తండ్రిని క్షణం కూడా వదలకుండా, తన పైచదువుల గురించి, భవిష్యత్ లో తన ఉన్నత లక్ష్యాల గురించి ఆనందంగా చెప్తోంది.

******

ప్రణవ్ పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. అందరూ సంతోషంగా ఉన్న సమయంలో అమ్మ తన నిర్ణయంతో బాధ పెడుతుంది. పైగా తనని చెడ్డవాడిగా చిత్రీకరించడానికి ఇంకా ఏమైనా కల్పిత ఆధారాలు పట్టుకుని వస్తే ఇక్కడ అందరూ నమ్మి, సిరితండ్రితో పాటు అందరూ సిరినుంచి తనని దూరం చేస్తారు. ఇంతలో తన ఫోనులో నోటిఫికేషన్ సౌండ్.. మళ్ళీ చెల్లెలు సర్ప్రైజ్ మెసేజ్ "మీ అండ్ మమ్మీ కమింగ్ టు ఇండియా" తను ఒక్కసారిగా సంతోషంగా పొంగిపోయి, అంతలోనే కుంగిపోయాడు.

*****

ఇందిర, ఝాన్సీ వెండి పళ్ళాలలో పసుపు, కుంకుమలు సిద్ధం చేస్తున్నారు. ఈరోజు గోల్డెన్ స్వాన్ హోటల్లో హల్దీ ఫంక్షన్. ఇందిర ఝాన్సీని చూస్తూ "చుట్టాలు అందరూ వస్తూనే ఉంటారు. ఈ వేడుకకు రంగుల పువ్వులు, పసుపు నీళ్ళు కావాలి. ముందుగా పసుపు దంచేం కుందెన, రోకలీలను అలంకరించాలి, వేగంగా పనులన్నీ స్టార్ట్ చేద్దాం ఝాన్సీ!" అంది. బిందెలన్నీ పసుపు నీళ్లతో, పువ్వులతో నింపి హరి, సుందరీలను కూర్చోపెట్టి ముఖానికి, ఒంటికి పసుపునంతా దట్టంగా పట్టించి పసుపు నీళ్లతో జలకా లాడించారు. ఒక్కొక్కరూ వచ్చి జల్లెడలతో కాబోయే దంపతుల తలపై పసుపు నీళ్ళ వర్షం కురిపించారు. వాళ్ళు బంగారంలా మెరుస్తూ ఉండగా చుట్టూ కాంతివంతంగా ముత్తైదువులు పాటలతో, కన్నెపిల్లలందరూ కలిసి డాన్సులు కనువిందు చేస్తుంటే పూర్తిగా ఆ హల్దీ సందడిలో సిరిమువ్వ డాన్స్ స్పెషల్ అట్రాక్షన్ అయింది.

"గారాల పట్టి చక్కనిది చక్కనిది, అందాల చిట్టి బుజ్జాయి బుజ్జాయి, కాటుక కళ్ళు మెరిసాయిలే" తక్కిన వారు స్టెప్పులేస్తున్నారు. ఇంతలో హఠాత్తుగా గుమ్మంలోకి వచ్చిన వసుమతి, సామ్రాట్ లను చూసి రాజీవ్ కి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. వచ్చీ రావడంతోనే రాజీవ్ తలకు గన్నుపెట్టీ, అందర్నీ "హ్యాండ్సప్! మీరెవరు అడ్డు వచ్చినా వీడి తల పేలుతుంది" అనగానే అందరూ భయభ్రాంతుల్లో మునిగారు. సామ్రాట్ రెట్టిస్తూ "ఒరేయ్.. ఏమిట్రా నా సామ్రాజ్యంలో బతికి, నా గుట్టు అంతా బయట పెట్టీ నీవు తప్పించు కుందామనుకున్నావా? నీ మాజీ ప్రియురాలు జ్వాలకి ఫోన్ చెయ్యి" అన్నాడు. కానీ రాజీవ్ నిర్భయంగా "ఒరేయ్ నాయనా! నువ్వు ఈ పనిచేసి నీకు బ్రతుకు నాశనం చేసుకోకు, పాపం ఒడిగట్టుకోకు. అమ్మా! నువ్విటు నా వైపురా. నీ పగ, ప్రతీకారం తీరే సమయం వచ్చింది నీకు నేనున్నాను. నేను పూర్తిగా మారాను" అన్నాడు. నాగరత్నం సామ్రాట్ ప్రతాపానికి లోలోపల సంతోషపడింది. కానీ, పైకి మాత్రం ఇలాంటి హింస వద్దని వారించింది.

ఇంతలో రాజీవ్ ఫోన్ డయల్ చేసి "జ్వాలా" అన్నాడు. అటువైపు జ్వాల విసుక్కుంది. "ఈ టైమ్ లో ఫోన్ ఏంటీ? నేను ఒక ముఖ్యమైన పనిలో ఉన్నా. చెప్పు త్వరగా" అంది. దానితో రాజీవ్ ఫోన్ ను సామ్రాట్ లాక్కుని "నేను చెప్తా" అని పెద్దగా నవ్వుతూ "నీ ప్రియుడి తలపై నా గన్ను ఉంది. తను మృత్యువుకు చాలా దగ్గరలో ఉన్నాడు. సో చెప్పింది విను.. నేను సామ్రాట్ ని అహహాహహ" అతని నవ్వు విని అందరూ ప్రమాదంలో ఉన్నారని అర్థమైంది జ్వాలకు. "ఏయ్ జ్వాలా! నువ్వు ముందు ముసుగు మనుషులను వదిలి పెట్టు, నీదగ్గర ఉన్న ఆస్తి పత్రాలు, ఫైళ్లు అన్నీ పట్టుకుని వెంటనే వచ్చేయ్. పది నిమిషాల్లో ఇక్కడ ఉండాలి" అన్నాడు.

(సశేషం)



విశ్వ విజేతలుగా భారత అమ్మాయిలు

- సౌతాఫ్రికా మీద 52 పరుగుల తేడాతో గెలుపు
- చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్
- తొలిసారి వన్డే ట్రోఫీని ముద్దాడిన వుమెనిండియా
- దీప్తి శర్మ, షెఫాలీ వర్మ, అమన్ జోత్ కౌర్ దూకుడు
- సఫారీలను ఓ ఆటాడుకున్న టీమిండియా బ్యాటర్లు
- కిక్కిరిసిన మైదానంలో 'వందేమాతరం' నినాదాలు

మహిళల వన్డే ప్రపంచకప్ లో టీమిండియా విజేతగా నిలిచింది. ఆదివారం నవీ ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచులో 52 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఎన్నో యేండ్ల నిరీక్షణకు తెరదించింది. అభిమానులతో కిక్కిరిసిన మైదానంలో 'వందేమాతరం' నినాదాల మధ్య మధ్య తమ చిరకాల కోరికను నెరవేర్చుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ఆట, షెఫాలీ వర్మ దూకుడు, అమన్ జోత్ కౌర్ స్టన్నింగ్ క్యాచ్ కూడా భారత్‌ను విజయం దిశగా నడిపించాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ 87, దీప్తి శర్మ 58, స్మృతి మంధాన 45, రిచా ఘోష్ 34 పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో ఖాక మూడు వికెట్లు తీయగా, మ్లబా, డిక్లెర్క్, ట్రయాన్ కు తలో వికెట్ దక్కింది. అనంతరం బ్యాటింగుకు దిగిన సౌతాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులు మాత్రమే చేయగలిగింది. కెప్టెన్ లారా వోల్వార్డ్ 101 పరుగులు సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. డెర్కసెన్ 35, మినహా మరే బ్యాటర్ కూడా సరిగా ఆడలేదు. భారత బౌలర్లలో దీప్తి శర్మ ఐదు వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించింది. షెఫాలీ వర్మ రెండు వికెట్లు పడగొట్టింది. శ్రీ చరణి కి ఒక వికెట్ దక్కింది. సౌతాఫ్రికా కు ఓపెనర్లు లారా వోల్వార్డ్, తజ్మిన్ బ్రిట్స్(23) ఆచితూచి ఆడారు. తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించిన ఈ జోడీని అమన్ జోత్ కౌర్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో విడదీసింది. కళ్లు చెదిరే త్రో సాయంతో తజ్మిన్ బ్రిట్స్‌ను రనౌట్ చేసింది. లారా ఇచ్చిన క్యాచ్‌ను అమన్ జోత్ అద్భుతంగా అందుకుంది. డీక్లెర్క్(18) పోరాడినా, ఆమెను దీప్తి శర్మ క్యాచ్ అందుకుని భారత్ కు విజయం అందించింది.

టీ20 సిరీస్‌లో టీమిండియా తొలి విజయం

- ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా తొలి విజయం నమోదు చేసింది. హోబర్ట్ లో ఆదివారం జరిగిన మ్యాచులో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. వాషింగ్టన్ సుందర్ దూకుడుగా ఆడి భారత్ ను విజయపథంలో నడిపించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసింది. టీమ్ డేవిడ్ 74, మార్కస్ స్టోయినీస్ 64 పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు, వరుణ్ చక్రవర్తి రెండు, శివమ్ దూబే ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగుకు దిగిన భారత్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 188 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ 49 నాటౌట్, జితేష్ శర్మ 22 నాటౌట్), తిలక్ వర్మ 29 పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు తీయగా, గ్జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినీస్ తలో వికెట్ తీసారు. మూడు వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఈ మైదానంలో ఇదే భారీ టీ20 స్కోర్ కావడంతో పాటు అత్యధిక ఛేజింగ్ రికార్డ్ కూడా ఇదే కావడం విశేషం. ఆస్ట్రేలియాకు ఇదే తొలి టీ20 పరాజయం. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-1తో కొనసాగుతుంది. నాలుగో టీ20 గురువారం గోల్డ్ కోస్ట్ వేదికలో జరుగుతుంది. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా, రెండో టీ20 ఆసీస్ గెలిచింది. టీమిండియా ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ బాగానే ఆరంభించాడు. భారీ సిక్సర్లు బాదాడు. అతడిని నాథన్ ఎల్లిస్ ఔట్ చేశాడు. శుభ్‌మన్ గిల్ (15) పరుగులకే ఔటయ్యాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వేగంగా ఆడే ప్రయత్నం చేసినా కుదరలేదు. అక్షర్ పటేల్‌తో కలిసి తిలక్ వర్మ కాసేపు పోరాడాడు. జితేశ్ శర్మతో కలిసి వాషింగ్టన్ సుందర్ చెలరేగాడు. భారీ సిక్సర్లతో వేగంగా ఆడుతూ పరుగులు రాబట్టాడు. జితేశ్ శర్మ కూడా అండగా నిలవడంతో భారత స్కోర్ పరుగెత్తింది.

పొట్టి ఫార్మాట్ నుంచి తప్పుకున్న కేన్ విలియమ్సన్

- 14 యేండ్ల సుదీర్ఘ కెరీర్ కు ముగింపు

న్యూజీలాండ్ స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు.దీంతో అతడి 14 యేండ్ల సుదీర్ఘ టీ20 కెరీర్‌కు తెరపడింది. కేన్ 2011లో టీ20లోకి ప్రవేశించాడు. 93 మ్యాచ్‌లు ఆడాడు. 33 సగటుతో 2,575 పరుగులు సాధించారు. ఇందులో 18 అర్ధ సెంచరీలు, అత్యధిక స్కోరు 95 పరుగులు ఉన్నాయి. నిరుడు ఇంగ్లాండ్‌పై తన చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. 93 మ్యాచ్‌లలో 75 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అతని సారథ్యంలోనే కివీస్ రెండు టీ20 ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. చాలా కాలంగా ఈ ఫార్మాట్‌ను ఆస్వాదించానని, ఆ జ్ఞాపకాలు, అనుభవాలకు తాను ఎంతో కృతజ్ఞుడనని కేన్ వివరించాడు. తన నిర్ణయం ఇప్పుడు తనతో పాటు జట్టుకు కూడా సరైనదని పేర్కొన్నారు. ఇది జట్టుకు ముందుకు సాగడానికి, తదుపరి ప్రధాన లక్ష్యం అయిన 2026 టీ20 ప్రపంచ కప్‌కు స్పష్టత ఇవ్వడానికి ఉపయోగపడుతుందని కేన్ అన్నాడు. ప్రస్తుత కెప్టెన్ మిచెల్ సాంట్నర్‌పై విలియమ్సన్ ప్రశంసలు కురిపించారు. తమ జట్టు మంచి కెప్టెన్ చేతుల్లో ఉందని అన్నారు. సాంట్నర్ ఒక అద్భుత నాయకుడని, నేను దూరం నుంచే అతనికి మద్దతు ఇస్తానని విలియమ్సన్ చెప్పాడు. తెలిపారు. న్యూజిలాండ్ క్రికెట్ సీఈఓ స్కాట్ వీనింక్ విలియమ్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆటగాడిగా కేన్ ప్రదర్శన, టీ20 జట్టు కెప్టెన్‌గా అతని సేవలు అద్భుతమని ప్రశంసించారు.



రాజస్థాన్ రాయల్స్ ను వీడనున్న సంజూ శాంసన్

- ఢిల్లీ కేపిటల్స్ కు వెళ్లే అవకాశం

సంజు శాంసన్ 2013లో రాజస్థాన్ రాయల్స్ లో చేరాడు. అప్పటి నుంచీ అదే జట్టులో కొనసాగుతున్నాడు. 2018లో అతన్ని రిలీజ్ చేసినా, తిరిగి అదే జట్టులో చేరాడు. 18 కోట్ల రూపాయలతో కాంట్రాక్ట్ పొడిగించుకున్నాడు. సుదీర్ఘకాలం జట్టుకు కెప్టెన్ గా ఉన్నాడు. అయితే, సంజూ ఇప్పుడు ఆర్‌ఆర్ ను వీడేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ డిసెంబర్ లో జరిగే మెగా వేలం కోసం అతడు ఫ్రాంఛైజీ ముందు రెండు షరతులు పెట్టాడు. ఒకటి తనను ట్రేడింగ్ చేయడం, రెండోది రిలీజ్ చేయడం. కానీ, రిలీజ్ కే అతను మొగ్గు చూపుతున్నాడని తెలిసింది. ఎందుకంటే, సంజు శాంసన్ ను చేర్చుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తిగా ఉందని, ఇప్పటికే అతడితో చర్చలు జరిగాయని చెబుతున్నారు. సంజు శాంసన్ కు రాజస్థాన్ రాయల్స్ కు మధ్య అంతర్గతంగా సమస్యలు ఉన్నాయనే ప్రచారం కూడా జరిగింది. ఇప్పుడతను ఢిల్లీ కేపిటల్స్ కు వెళ్లనున్నాడు. దీనికి సంబంధించిన వ్యవహారాలు లాంఛనంగా పూర్తయినట్లు తెలుస్తోంది. రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పరస్పరం మార్పిడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. సంజు శాంసన్ ఢిల్లీ కేపిటల్స్ కు వెళ్లేలా, అక్కడ ఉన్న ట్రిస్టన్ స్టబ్స్ రాజస్థాన్ రాయల్స్‌కు షిఫ్ట్ చేసేలా ఈ రెండు ఫ్రాంఛైజీలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ చర్చలు తుది దశకు చేరుకున్నాయి.

షారుఖ్ ఖాన్ 'కింగ్'

- టైటిల్ గ్లింప్స్ రిలీజ్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పుట్టినరోజు (నవంబర్ 2) సందర్భంగా ఆయన కొత్త సినిమా 'కింగ్' కు సంబంధించిన అప్‌డేట్ విడుదలైంది. అభిమానులకు బర్త్‌డే ట్రీట్‌గా.. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ నుంచి టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేసింది చిత్రబృందం. పఠాన్ దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తుంది. ఈ సినిమా 2026 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఫైనల్ యాక్షన్ కి వచ్చిన మన శంకర వరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్ గా దర్శకుడు అనీల్ రావిపూడి నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే "మన శంకర వరప్రసాద్ గారు". విక్టరీ వెంకటేష్ కూడా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇలా జెట్ స్పీడ్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ఫైనల్ యాక్షన్ లోకి వచ్చినట్టు తెలుస్తోంది. దీని ప్రకారం మేకర్స్ మెగాస్టార్ పై ఓ సాలిడ్ యాక్షన్ సీక్వెన్స్ ని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక ఇది కూడా పూర్తయితే సినిమా ఒక కొలిక్కి రావడమేనట. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు అలాగే షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తుండగా వచ్చే ఏడాది సంక్రాంతి రేస్ లో ఈ సినిమా రిలీజ్ కి రాబోతుంది.

ఆంధ్ర కింగ్ తాలూకా ఫినిషింగ్ టచ్

టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని లీడ్ రోల్‌లో నటిస్తోన్ చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వంలో RAPO 22గా వస్తోన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఈ చిత్రాన్ని నవంబర్ 28న విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా రామ్ ఫినిషింగ్ అప్‌డేట్ అందించాడు. ఆంధ్ర కింగ్ తాలూకా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా లొకేషన్‌లో రామ్ అండ్ టీం కేక్ కట్ చేశారు. ఈ సినిమా త్వరలో మీ అందరినీ గర్వంగా ఫీలయ్యేలా చేస్తుంది. నా కెరీర్‌లో అందమైన సినిమాను అందించిన మహేశ్ బాబుకు ధన్యవాదాలు అని ట్వీట్ చేశాడు. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రూ.40 కోట్ల క్లబ్‌లో 'కె ర్యాంప్'

దీపావళి పండుగ కానుకగా విడుదలైన కిరణ్ అబ్బవరం 'కె ర్యాంప్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే బ్రేక్ ఈవెన్‌ను పూర్తి చేసుకుని దూసుకుపోతున్న ఈ చిత్రం తాజాగా రూ.40 కోట్ల క్లబ్‌లో చేరినట్లు చిత్రబృందం ప్రకటించింది. తొలిసారిగా మెగా ఫోన్ పట్టిన డెబ్యూ డైరెక్టర్ జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా యువతరం ఈ చిత్రాన్ని చూసేందుకు థియేటర్లకు క్యూ కడుతున్నారు. చిత్ర విజయం పట్ల సోషల్ మీడియాలో కిరణ్ అబ్బవరం ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ విజయాన్ని ఉత్సవంలా జరుపుకుంటున్నారు. ఈ సినిమాలో యుక్తి తరేజా కథానాయికగా నటించగా.. రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించాడు. సాయి కుమార్, నరేష్ కీలక పాత్రలో నటించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200